# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 12-7-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 276 | పేజీలు:6 | వెల: రూ.1/-


## ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతివ్వండి- ఉద్ధవ్‌ను కోరిన శివసేన ఎంపీలు

ముంబై, జులై 11: మహారాష్ట్ర రాజకీయాల్లో అనిశ్చితి నెలకొన్న తరుణంలో శివసేన ఎంపీలు కీలక ప్రతిపాదన చేశారు. ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతివ్వాలని పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు సూచించారు. అయితే రెండు రోజుల్లో తన నిర్ణయం చెబుతానని ఆయన అన్నారు. శివసేనకు 19 మంది లోక్‌సభ, ముగ్గురు రాజ్యసభ సభ్యులున్నారు. సీఎం ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు నేపథ్యంలో పలువురు ఎంపీలు కూడా ఆయనకు మద్దతిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

ఈ తరుణంలో ఉద్ధవ్ ఠాక్రే పార్టీ ఎంపీలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన నివాసం మాతోశ్రీలో జరిగిన ఈ భేటీకి ఆయన వర్గం అయిన 16 మంది ఎంపీలు హాజరయ్యారు. రాష్ట్రపతి ఎన్నికలపై ఈ సందర్భంగా చర్చించారు. అయితే గిరిజనురాలైన ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతివ్వాలని పార్టీ ఎంపీలు ఉద్ధవ్ ఠాక్రేను కోరారు. మహారాష్ట్రలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్నందున ఆమెకు ఓటు వేద్దామని సూచించారు. దీనిపై తన నిర్ణయాన్ని రెండు రోజుల్లో చెబుతానని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న శివసేన ఎంపీ గజానన్ కీర్తికర్ ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు.



## ఉగ్ర గోదారి.. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

హైదరాబాద్, జులై 11:రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాలతో పాటు నదీ పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో నదులకు వరద పోటెత్తుతున్నది. ఇప్పటికే గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 98,275 క్యూసెక్కులు ఉండగా.. అవుట్ ఫ్లో 41వేల క్యూసెక్కులుగా ఉన్నది. దీంతో అధికారులు ప్రాజెక్టు తొమ్మిది గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. జలాశయం ప్రస్తుత నీటిమట్టం 1088.1 అడుగులు కాగా, పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుత నీటి నిల్వ 76.743 టీఎంసీలు నీరు నిల్వ ఉండగా.. గరిష్ఠస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలు.

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

శ్రీరాంసాగర్ నుంచి భద్రాచలం వరకు వరద కొనసాగుతున్నది. ప్రస్తుతం నదిలో వరద ఉధృతి పెరుగుతున్నది. దీంతో అధికారులు భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. నదిలో భారీగా పెరుగుతున్న నీటిమట్టం పెరుగుతున్నది. భద్రాచలం వద్ద 52.2 అడుగులకు నీటిమట్టం పెరిగింది. 53 అడుగులు దాటితే చివరి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో దిగువన ఉన్న మండలాలకు నిలిచిన రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి ప్రవాహం 13,80,071 క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## 14 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు

హైదరాబాద్, జులై 11:ఒడిశా పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా నుంచి ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టం నుంచి 7.6 కిలోమీటర్ల వరకు విస్తరించి ఎత్తుకు వెళ్లే కొద్ది నైరుతి దిశగా వంపు తిరిగింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 14 వరకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ జారీ చేసింది.

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూ పాలపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు.. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖ మ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వ రంగల్, హనుమకొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెద క్, కామారెడ్డి, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## శ్రీరాంసాగర్‌కు భారీ వరద.. 9 గేట్లు ఎత్తివేత

నిజామాబాద్, జులై11: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. భారీ వర్షాలతో జలాశయంలోకి 85,740 క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో అధికారులు 9 గేట్లను ఎత్తివేసి 41 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులుకాగా, ప్రస్తుతం 1087.6 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. ఇక జలాశయంలో 90.3 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఇప్పుడు 75.15 టీఎంసీల నీరు ఉన్నది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతున్నది. దీంతో అధికారు 19 గేట్లు ఎత్తివేసి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 29,145 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 26,182 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా, ప్రస్తుతం 70.50 మీటర్ల వద్ద నీరు ఉంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ భావనలను, సాక్ష్యములను
పావన భాషణాతను వీని పరమేశ్వరుడై
కావించిన తీర్పులతో
శ్రీ "వై.వీ. చంద్రచూడ్" చేకొనెను నతుల్

(జులై 12 న్యాయమూర్తి చంద్రచూడ్ జననం...)

-రాధశ్రీ
సెల్: 9494481210



## ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం : సీఎం కేసీఆర్



హైదరాబాద్, జులై 11: భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు, వరద పరిస్థితులపై ప్రగతి భవన్‌లో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రగతి భవన్ నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులతో ఫోన్లలో మాట్లాడుతున్నారు. అక్కడి పరిస్థితికి అనుగుణంగా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అప్పటికప్పుడే సీఎం కేసిఆర్ ఆదేశాలిచ్చారు.

అన్ని జిల్లాల అధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అంచనా వేశారు. గోదావరిలో వరద పరిస్థితిని, నదీ ప్రవాహాన్ని, గోదావరి ఉపనదుల్లో వరద పరిస్థితిని సీఎం ఆరా తీశారు. సమాచారాన్ని స్క్రీన్ మీద పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తు అంచనా వేసి తగిన సూచనలు చేశారు. అవసరమైన చోట తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదురోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని సీఎం కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు.

సమీక్షా సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు దామోదర్ రావు, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు రాజీవ్ శర్మ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పైళ్ల శేఖర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్యకార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, సీఎంవో కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, స్మితా సబర్వాల్, భూపాల్ రెడ్డి, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ మురళీధర్, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, శాంతి భద్రతల విభాగం అడిషనల్ డీజీ జితేందర్ పాల్గొన్నారు.

## పార్లమెంట్ నూతన భవనం కప్పుపైన చెక్కినటువంటి జాతీయ చిహ్నాన్ని ఆవిష్కరించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 11: "పార్లమెంట్ రూపకల్పన లో భాగం పంచుకొన్న శ్రమజీవులతో నేను జరిపిన భేటీ అపురూపమైనటువంటిదిగా ఉంది. వారి ప్రయాసల ను చూసుకొని మనం గర్వపడుతున్నాం; మరి మన దేశ ప్రజల కోసం వారు అందించినటువంటి తోడ్పాటు ను సదా స్మరించుకోవడం జరుగుతూ ఉంటుంది కూడాను" అని ప్రధాన మంత్రి తెలిపారు.

జాతీయ చిహ్నాన్ని మొత్తం 9500 కిలోగ్రాముల బరువు కంచు లోహాన్ని కరగించి పోత పోసి తయారు చేయడమైంది. ఆ జాతీయ చిహ్నం ఎత్తు 6.5 మీటర్లు ఉంది. పార్లమెంట్ నూతన భవనం యొక్క కేంద్రీయ రంగశాల కు అగ్రభాగాన ఈ సూచక చిహ్నాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చిహ్నానికి ఊతం గా దాదాపు గా 6500 కిలోగ్రాముల బరువు తో ఉ ండే ఒక ఉక్కు నిర్మాణాన్ని నిర్మించారు.

పార్లమెంట్ నూతన భవనం కప్పు మీద జాతీయ చిహ్నాన్ని ఏర్పాటు చేయాలన్న భావన తో పాటు సంబంధిత ప్రక్రియ లు.. బంకమట్టి నమూనా ను తీర్చిదిద్దడం/ కంప్యూటర్ గ్రాఫిక్ ను తయారు చేయడం మొదలుకొని కంచు ను కరిగించి పోత పోయడం మరియు మెరుగులు పెట్టడం వరకు.. ఎనిమిది వివిధ దశల గుండా సాగాయి. ఆ తరువాత తుది రూపు సిద్ధమైంది.

## పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తున్నాం : మంత్రి కేటీఆర్




సంగారెడ్డి, జులై 11 (నేటినిజం ప్రతినిధి): పటాన్ చెరు మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో అల్‌ప్లా ఇండియా పరిశ్రమలో వరల్డ్‌క్లాస్ మౌల్డ్ యూనిట్‌ను, డ్యూయల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తలపై, పెట్టుబడిదారులపై ఎలాంటి ఒత్తిడి లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ ద్వారా పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో స్థిరమైన, సామర్థ్యం ఉన్న ప్రభుత్వం వల్ల జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు అధికంగా ఉందన్నారు. తెలంగాణలో సమ్మిళిత అభివృద్ధి జరగాలని ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాం. దిగుమతులు తగ్గించి.. స్థానికంగానే ఉత్పత్తి పెంచి.. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు.

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో ఐదు విప్లవాలు వచ్చాయన్నారు. సశ్య విప్లవంతో లక్షల ఎకరాల సాగులోకి వచ్చాయి. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. నీలి విప్లవంతో మన దేశ అవసరాలతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో చేపల ఉత్పత్తి ఉ ందని కేటీఆర్ తెలిపారు. క్షీర విప్లవంతో రాష్ట్రంలో పాల ఉత్పత్తి పెరిగింది. రాష్ట్రం ఏర్పడే నాటికి అప్పులతో మూతపడే దశలో ఉన్న విజయా డైరీ.. నేడు ప్రభుత్వానికి డివిడెంట్ ఇచ్చే స్థాయికి ఎదిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గులాబీ విప్లవంతో మాంసం ఉత్పత్తి కూడా పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. పసుపు విప్లవంతో రాష్ట్రంలో నూనె గింజల ఉత్పత్తి పెరగనుందన్నారు. వచ్చే ఐదేండ్లలో 25లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఎల్లుండి నుంచి విశాఖ శారదా పీఠాధిపతి చాతుర్మాస దీక్ష



పెందుర్తి. జులై 11 విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఈ నెల 13 నుంచి పవిత్ర చాతుర్మాస దీక్ష చేపట్టనున్నారు. రుషికేష్‌లో ఉన్న శ్రీశారదాపీఠంలో గురుపూర్ణిమ సందర్భంగా వీరిరువురూ ఈ దీక్షను ఆచరించనున్నారు. గురు పూర్ణిమ పర్వదినం రోజున వ్యాస పూజతో దీక్షకు అంకురార్పణ జరుగనున్నది. స్వామీజీకి ఇది 26వ దీక్ష. ఉ త్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతికి నాలుగోది.

చాతుర్మాస దీక్షా కాలంలో స్వామీజీలు ఎలాంటి పర్యటనలు చేపట్టరు. మొదటి నెలలో కూరలు, రెండో నెలలో పెరుగు, మూడో నెలలో పాలు, నాలుగో నెలలో పప్పుదినుసులను తీసుకోరు. ఈ సమయంలో సాధువులకు, సన్యాసులకు అన్నదానం నిర్వహించి దక్షిణలు సమర్పిస్తారు. దీక్షా కాలంలో పీఠానికి పరంపరానుగతంగా వచ్చిన గురువులను స్వామీజీలు నిరంతర స్మరించుకుంటారు. ఆది శంకరుని శంకరభాష్యాన్ని, ప్రస్థానత్రయ భాష్యాన్ని పఠిస్తూ పరమ పవిత్రంగా దీక్షను కొనసాగిస్తారు. నిత్యం పీఠాధిపతులు తమ స్వహస్తాలతో గంగానదికి హారతులిస్తారు.

గంగమ్మతల్లికి నిత్య పూజలు చేసిన తర్వాత శ్రీశారదా పీఠం అధిష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి, చంద్రమౌళీశ్వరులకు నిత్య పీఠార్చన చేస్తారు. వేద విద్యార్థులకు స్వామీజీ ధార్మిక అంశాలను బోధిస్తారు. దీక్షా కాలంలో స్వామీజీని కలిసి ఆశీస్సులు తీసుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి ప్రముఖులు రుషికేష్‌కు వెళ్తుంటారు. సెప్టెంబరు 20న చాతుర్మాస్య దీక్ష ముగిసేంత వరకు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వామీజీలు రుషికేశ్‌లోనే ఉంటారు. దీక్షా కాలంలో వినయక చవితి, కృష్ణాష్టమి వేడుకలను ఆశ్రమంలోనే జరుపుతారు.

## ఎస్ఎన్డీపీ పనులు పూర్తయితే.. వరదముప్పు ఉండదు : సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, జులై 11: ఎస్ ఎన్ డి పి పనులు జరుగుతుండడంతో కొన్ని కాలనీల్లో ఈ వర్షాకాలంలో ఇబ్బంది ఉంటుందని పనులు పూర్తయితే భవిష్యత్తులో వరద ముప్పు సమస్యనే ఉండదని విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీధర్ కాలనీ, వెంకట సాయి కాలనీ, ఎస్ ఎన్ డి పి పనులు, వరద ముప్పు ప్రాంతాలను మంత్రి సబితా ఇంద్రారెడ్డి మేయర్ దుర్గా దిప్లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డితో కలిసి పర్యటించి కాలనీ వాసులకు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ? రెండు రోజులుపాటు కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా సీఎం కేసీఆర్ అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

సచివాలయం, జిల్లా, మండలం మున్సిపాలిటీ ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. మీర్పేట్ బడంగ్పేట్ కార్పొరేషన్ లో వరద కాలువ పనులు జరుగుతుండడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మేయర్, డిప్యూటీ మేయర్ కార్పొరేటర్ కమిషనర్ అందుబాటులో ఉండి పనిచేయాలని ఆదేశించారు. అధికారులు వేగంగా వరద కాలువ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శ్రీధర్ కాలనీలో కొంత భాగం జీహెచ్ఎంసీ పరిధిలో వస్తున్న కారణంగా కాల్వపంలో కొంత ఆలస్యమైన మాట వాస్తవమన్నారు. ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్లు చొరవ తీసుకొని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగేశ్వర్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ సుజాతా నాయక్, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్స్ బొక్క రాజేందర్ రెడ్డి, ఇందివత్ రవినాయక్, గజ్జల రామచంద్రయ్య, చల్ల బాల్ రెడ్డి, సిద్దాల బీరప్ప, జిల్లెల ప్రభాకర్ రెడ్డి, మాదారి రమేష్, సిద్దాల అంజయ్య రాజకుమార్, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.. మంత్రి ఐకేరెడ్డి ఆదేశం

నిర్మల్, జులై 11: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముధోల్ నియోజకవర్గంలోని టాక్లి, బిద్రెల్లి, కిర్గుల్ గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీతో కలిసి పర్యటించారు. ముంపు బాధితులతో మాట్లాడి, సాధకబాధకాలను తెలుసుకున్నారు. దెబ్బతిన్న డ్రైనేజీలు, రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆయా రహదారుల మరమ్మతులకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షాలతో జిల్లాలో పలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థ కల్పించే దిశలో వెంటనే క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు నిర్వహించి, కొన్ని రహదారుల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించామని తెలిపారు.


సాహిత్యం



ఆహ్వానం

సంగీతం



శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త ఆధ్వర్యంలో




ప్రముఖ రచయిత
శ్రీ శిష్టి శేషగిరి గారు
రచించిన



నేను కాలాన్ని
కవితా సంపుటి
ఆవిష్కరణ మహోత్సవం

తేది : 13-07-2022 బుధవారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : శ్రీ త్యాగరాయ గానసభ, కళాసుబ్బారావు కళావేదిక, హైదరాబాద్

ముఖ్య అతిథి : డా॥ కె.వి.రమణాచారి గారు
తెలంగాణా ప్రభుత్వ సలహాదారు

సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు గారు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక

విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి గారు
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

ఆత్మీయ అతిథి : శ్రీ పొత్తూరి సుబ్బారావు గారు
సంపాదకులు, సాహితీ కిరణం

పుస్తక పరిచయం : డా॥ లలితవాణి గారు, ప్రముఖ విద్యావేత్త

శ్రీమతి కళా శారద, కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ | బండారుపల్లి రామచందర్ రావు, అధ్యక్షులు, మానస ఆర్ట్స్ | కోకా భవాని, కన్వీనర్, మానస ఆర్ట్స్ | రఘుశ్రీ, కార్యదర్శి, మానస ఆర్ట్స్, 9247108893

# అధిక జనాభా దేశానికి అనర్థదాయకమా..?

## (11 జూలై 'ప్రపంచ జనాభా దినం' సందర్భంగా)

నేడు ప్రపంచ జనాభా 790 కోట్లు దాటుతుండగా, భారతదేశ జనాభా 139 కోట్ల మార్కు దాటుతూ పరుగులు పెడుతోంది. చైనా దేశ జనాభా 145 కోట్లతో ప్రథమ స్థానంలో ఉండగా, ఇండియా జనాభాలో ద్వితీయ స్థానంలో, అమెరికా 33.20 కోట్లతో తరువాత స్థానంలో నిలుస్తున్నాయి. ప్రపంచ జనాభాలో 4.45 బిలియన్ల (అనగా 57 శాతం) జనాభా 10 దేశాల్లోనే ఉందని గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రపంచ జనాభా ఒక బిలియన్ చేరడానికి 2 మిలియన్ల సంవత్సరాలు పట్టగా, 7 బిలియన్లు నమోదు కావడానికి 200 ఏండ్లు మాత్రమే తీసుకొందనే విషయం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 1955-65 మధ్య జనాభావృద్ధి రేటు సాలీన 1.8 శాతం ఉండగా, 1965-70 మధ్య 2.1 శాతం, 2010-15 మధ్య కాలంలో 1.2 శాతానికి పడిపోయింది. నేడు జనాభావృద్ధి రేటు ఏడాదికి 1.1 శాతం ఉండవచ్చని అంచనా.

అధిక జనాభా ప్రతికూల ప్రభావాలు:

భూగ్రహపు సుస్థిర ఉనికి కోసం జనాభా 8 బిలియన్లు మాత్రమే ఉండాలని, ఈ మార్కు దాటినపుడు ధరణిపై అధిక జనాభా ఉన్నట్లు, ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశం ఉన్నట్లుగా భావించాలి. 2050 నాటికి ప్రపంచ జనాభా 9-10 బిలియన్లకు చేరవచ్చని ఐరాస అంచనా వేస్తూ హెచ్చరిస్తున్నది. ప్రపంచ జనాభా 8 బిలియన్లు దాటకుండా జాగ్రత్త పడాలని ప్రపంచ దేశాలను ఐరాస కోరుతున్నది. 1980ల్లో జననాల రేటు ఏడాదికి 139 మిలియన్లు, 2011లో 135 మిలియన్లు ఉండగా, మరణాల రేటు సాలీన 56 మిలియన్లుగా నమోదు అవుతున్నది. 2012 వివరాల ప్రకారం లింగ నిష్పత్తి 1000 పురుషులు : 900 మహిళలుగా ఉండడం ప్రమాదకరమని భావించాలి. భారత్ లాంటి అధిక జనాభా కలిగిన దేశాల్లో నిరక్షరాస్యత, ప్రజారోగ్య సమస్యలు, నిరుద్యోగం, అశాంతి, ఆర్థిక సామాజిక అసమానతలు, పేదరికం లాంటి పలు సమస్యలు ముడిపడి ఉంటాయి.

వయస్సు వారీ ప్రపంచ జనాభా:

1804లో ప్రపంచ జనాభా ఒక బిలియన్ ఉండగా, 1927లో 2 బిలియన్లు, 1960లో 3 బిలియన్లు, 2000లలో 6 బిలియన్లు, నేడు 7.9 బిలియన్లుగా ఉన్నది. ప్రపంచ జనాభాలో 15 ఏండ్ల లోపు జనాభా 26.3 శాతం, 15-64 మధ్య వయస్కులు 65.9 శాతం, 65 ఏండ్లు దాటిన జనాభా 7.9 శాతం ఉన్నది. డబ్ల్యూహెచ్ఓ వివరాల ప్రకారం నేడు ప్రపంచ సగటు జీవితకాలం 72.81 ఏండ్లు (ఇండియా 69 ఏండ్లు) ఉంది. ప్రపంచ జనాభాలో 18.4 శాతం కడు పేదరికంలో, 12.3 శాతం పోషకాహార లోపంతో బతుకుతున్నారని విశ్లేషించబడింది. జనసాంద్రతలో సింగపూర్ (ఒక చదరపు కిమీకు 8,033 జనాభా) అగ్రస్థానంలో ఉండగా 10వ స్థానంలో (చదరపు కిమీ 420) ఇండియా ఉన్నది. జనాభా, జనసాంద్రత కలిపిన గణాంకాల ప్రకారం అన్ని దేశాల్లోకి భారత్ ప్రథమ స్థానంలో ఉన్నది. కరోనా మహమ్మారి ప్రళయ వేళ అలల తాకిడి తగ్గుతున్న సంతోష క్షణాల్లో 4వ అల విజృంభించవచ్చనే భయం నడుమ ప్రపంచ జనులు భయం, నిస్సహాయతలతో కాలం గడపడం జరుగుతున్నది. కోవిడ్-19 కారణంగా గోరుచుట్టుపై రోకలి పోటులా పేదప్రజల సమస్యలు రెట్టింపు కావడం జరుతున్నది. కరోనా లాక్‌డౌన్లు, కర్ఫ్యూలు, క్రమశిక్షణలతో 12 మిలియన్ల మహిళలు కుటుంబ నియంత్రణకు దూరం అయ్యారని తెలుస్తున్నది.

ప్రపంచ జనాభా దినం-2022 నినాదం:

11 జూలై 1987న ప్రపంచ జనాభా 5 బిలియన్లు చేరిన వేళ ప్రపంచ బ్యాంకు అధికారి కె.సి. జచరియా సూచన మేరకు, జనాభా విస్ఫోటన ప్రతికూలతలను చర్చించడానికి ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం 11 జూలై 1989 రోజు నుంచి ప్రతి ఏట 'ప్రపంచ జనాభా దినం' పాటించుట జరుగుతున్నది. జనాభా పెరుగుదలతో సంబంధం ఉన్న సమస్యలైన పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, లింగ అసమానతలు, మాతాశిశు మరణాలు, ఆరోగ్య సమస్యలు, లైంగిక అవిద్య, బాల్య వివాహాలు, బాలికల అవిద్య, పట్టణీకరణ, యస్‌టిడి వ్యాధులు, కుటుంబ నియంత్రణలో అవగాహన లేమి, మానవ హక్కుల ఉల్లంఘనలను అవగాహన కల్పించడానికి ఈ వేదికను ఉపయోగించుకోవడం జరుగుతున్నది. ప్రపంచ జనాభా ప్రతి ఏట 83 మిలియన్లు పెరుగుతూ, 2030 నాటికి 8.6 బిలియన్లు చేరవచ్చని అంచనా. ప్రపంచ జనాభా దినం-2022 నినాదంగా 'ఏ వరల్డ్ ఆఫ్ 8 బిలియన్ : టువరిడ్స్ ఏ రెసిసలియంట్ ఫ్యూచర్ ఫర్ ఆల్ - హార్నెసింగ్ అపర్చునిటీస్ అండ్ ఎన్‌శూరింగ్ అపర్చునిటీస్ అండ్ చాయిసెస్ ఫర్ ఆల్' అనే అంశాన్ని తీసుకున్నారు. జనాభావృద్ధిని అరికట్టుటలో సంతానోత్పత్తి రేటుతో పాటు పునరుత్పత్తి ఆరోగ్యం, మాతాశిశు సంక్షేమంపై దృష్టి సారించాలి.

జనాభాలో తొలి స్థానం దిశగా భారతం:

139 కోట్ల జనాభా దాటిన ఇండియా జనాభాలో 2వ స్థానంలో నిలుస్తూ, మరో నాలుగు దశాబ్దాల్లో ప్రథమ స్థానం చేరటానికి ఉకరలు వేస్తున్నది. ప్రపంచ జనాభాలో 17 శాతం జనాభా భారత్‌లోనే ఉన్నది. సగటు జీవిత కాలం పెరుగుతున్న ఈ ఆధునిక తరుణంలో జనాభావృద్ధి వేగంగా జరుగుతున్నది. జపాన్ లాంటి దేశాల్లో జనాభా క్రమంగా తగ్గుతున్నప్పటికీ ఇండియా లాంటి దేశాల్లో మాత్రం పెరుగుతోంది. అమెరికాతో పోల్చితే ఇండియాలో భూభాగం సగం కన్న తక్కువగా ఉన్నదని, జనాభాలో మాత్రం నాలుగు రెట్లు అధికంగా ఉంటూ పెద్ద సమస్యగా పరిణమిస్తుతున్నది. ప్రభుత్వాలు తీసుకున్న కుటుంబ నియంత్రణ పటిష్ట చర్యలతో పాటు ప్రజల ఆలోచనల్లో వచ్చిన మార్పులతో కూడా సాలీన జనాభావృద్ధి రేటు ఒక శాతం చేరడం లేదు. భారత్‌లో వేల గిరిజన తెగలు, వేల కులాలు, వందల భాషలు, పలు మతాలు ఉన్నందున జనాభాను అరికట్టుటలో ఆశించిన ఫలితాలు సిద్ధించడం లేదు. దేశ జనాభా పెరిగిన కొద్దీ బాలిక/మహిళా సమస్యలు అనేక రెట్లు అధికం కావడం జరుగుతున్నది. జనాభా పెరుగుదల సమాజానికి ఓ బహువ్యాధి లక్షణంగా గుర్తించబడింది.

జనాభా నియంత్రణ మార్గాలు:

జనాభావృద్ధిని అరికట్టడానికి, నియంత్రించడానికి కుటుంబ నియంత్రణ కనీస అవసరంగా ప్రతి ఒక్క పౌరుడు భావించాలి. జనాభా విస్ఫోటనంతో ప్రత్యక్షంగా జరిగే నష్టాలను సామాన్య ప్రజలకు వివరించాలి. జనాభాను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయాలి. యువ ఇండియాలో 15-24 మధ్య వయస్సుగల యువత 19.1 శాతం, అనగా 23 కోట్ల ఉన్నారు. అత్యధిక యువత కలిగిన భారతం ప్రపంచానికి నైపుణ్య అండ కావాలి. యువతకు సరైన విద్య, నైపుణ్యాలను పెంపొందించడంతో దేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు భారత్ నైపుణ్య వెలుగులు పరిచయం చేసే స్థితికి చేరాలి. అందరు యువతీయువకులకు అత్యవసర శాస్త్రసాంకేతిక విద్యను కల్పిద్దాం. మన జనాభా బరువు కాదని, జాతి అభివృద్ధికి ఆదరువుతో పాటు కొండంత అండ కావాలని కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## నాగ్‌పూర్‌లో ప్రపంచ రికార్డు - ఏక వరుస స్తంభాల మద్దతుతో హైవే ఫ్లైఓవర్ & మెట్రో రెయిల్ మార్గంతో పొడవైన డబుల్ డెక్కర్ వంతెన నిర్మాణం

న్యూఢిల్లీ, జులై 11: మరొక ప్రపంచ రికార్డు ! ఒకే వరుస స్తంభాల మద్దతుతో హైవే ఫ్లై ఓవర్ ఓ మెట్రోరెయిల్ మార్గంతో పొడవైన డబుల్ డెక్కర్ వంతెన (3.14 కిమీ)ను నాగ్‌పూర్ నిర్మించి ప్రపంచ రికార్డు సాధించినందుకు మహారాష్ట్ర మెట్రో బృందానికిఓ ఎన్‌హెచ్‌ఏఐ బృందానికి అభినందనలు అంటూ కేంద్ర రహదారి రవాణా, హైవేల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ట్వీట్‌ల పరంపరలో కొనియాడారు.

నాగ్‌పూర్‌లో డబుల్ డెక్కర్ వయాడక్ట్‌పై గరిష్ట మెట్రో స్టేషన్లను నిర్మించడాన్ని ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఓ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించాయని, ఇది మొత్తం దేశానికే గర్వకారణమైన క్షణమని అన్నారు.

ఈ రోజును సాకారం చేసేందుకు పగలు రాత్రి పట్టుదలతో కృషి చేసిన అద్భుతమైన ఇంజినీర్లు, అధికారులు, కార్మికులకు శ్రీ గడ్కరీ కృతజ్ఞతలు తెలిపారు. నవ భారతదేశంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మిస్తామని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసిన వాగ్దాన అమలుకు ఈ అభివృద్ధి నిదర్శనమని ఆయన అన్నారు.

## ప్రారంభమైన "సుపరిపాలన కోసం పౌరులు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేయడం" అనే అంశంపై రెండు రోజుల ప్రాంతీయ సదస్సు

న్యూఢిల్లీ, జులై 11: "పౌరులు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని సుపరిపాలనకు దగ్గర చేయడం" అనే అంశంపై రేపటి నుండి బెంగుళూరులో రెండు రోజుల ప్రాంతీయ సదస్సు జరగనుంది. కర్ణాటక ప్రభుత్వ సహకారంతో పరిపాలనా సంస్కరణలు ప్రజా ఫిర్యాదుల విభాగం ఈ ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహిస్తోంది. కేంద్ర సహాయ మంత్రి (ఇండిపెండెంట్ చార్జ్) సైన్స్ ఓ టెక్నాలజీ; కేంద్ర మంత్రి (ఇండిపెండెంట్ చార్జ్) ఎర్త్ సైన్సెస్; పీఎంఓ సహాయమంత్రి, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ స్పేస్శాఖల మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కర్ణాటక ప్రభుత్వ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై జూలై 12వ తేదీన ప్రారంభ సదస్సులో పాల్గొంటారు. కేంద్రం, రాష్ట్ర జిల్లా స్థాయిలో వివిధ పరిపాలనా సంస్కరణల ద్వారా ప్రభుత్వం పౌరులను మరింత చేరువ చేసే ప్రయత్నం ఈ సదస్సు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, "గరిష్ట పాలన, కనిష్ట ప్రభుత్వం" అనే విధాన లక్ష్యంతో తదుపరి తరం సంస్కరణలు, ఆవిష్కరణలను అనుసరించడం ద్వారా ప్రారంభమవుతోంది. ప్రభుత్వ ప్రక్రియ రీ-ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ -సేవలకు సార్వత్రిక ప్రాప్యత, జిల్లా స్థాయిలో డిజిటల్ కార్యక్రమాలలో శ్రేష్ఠత అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను, ఐసీటీ నిర్వహణను ఉపయోగించడంలో శ్రేష్ఠత వంటి అంశాలపై ఈ రెండు -రోజుల ఈవెంట్ చర్చలు జరుగుతున్నాయి. కింద పేర్కొన్న ఆరు అంశాలు (తి) పరిపాలనా సంస్కరణలు; (తితి) వీక్షణలో బయట: ప్రైవేట్ రంగం ఓ సుపరిపాలన; (తితితి) ఉత్తమ అభ్యాసాల ప్రతిరూపం; (తిల) రాష్ట్రాలలో పరిపాలనా సంస్కరణలు; (ల) బెంచ్‌మార్కింగ్ గవర్నెన్స్ (లతి) గుడ్ గవర్నెన్స్‌లో స్టార్టప్‌లు ప్రయోగాలపై చర్చలు, వర్క్షాప్లు ఉంటాయి. ఏఆర్పీజీ అదనపు కార్యదర్శి అమర్ నాథ్ స్వాగత ప్రసంగం చేస్తారు. కర్నాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వందిత శర్మ, వి.శ్రీనివాస్, ఏఆర్పీజీ సెక్రటరీ కూడా ఈ వేడుకలో ప్రసంగిస్తారు. ఈ వేడుకలో కర్ణాటకలోని డీపీఏఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ కృష్ణ ధన్యవాదాలను సమర్పిస్తారు. అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుండి ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారు. కాన్ఫరెన్స్‌లో -ఇండియా అంతటి నుండి 400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది. కాన్ఫరెన్స్ సెమీ వర్చువల్ మోడ్‌లో జరుగుతోంది.




## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### -అధికారులు అందరూ హెడ్ క్వార్టర్ లో అందుబాటులో ఉండాలి -జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, జూలై 11 (నేటి నిజం ప్రతినిధి) రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పేర్కొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలోకి నీరు చేరకుండా రెవెన్యూ,పంచాయతీ, మున్సిపల్ యంత్రాంగాలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో ఎవరు ఉండవద్దని, అలాంటి వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు.

వాగులు ,వంకలు పొంగి పొరలి ప్రవహిస్తున్నందున అటువైపు ఎవరు వెళ్లకుండా చూడాలని, పొంగి ప్రవహించే అన్ని వాగులు, బ్రిడ్జిల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేసేలా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

గ్రామాలలోని ప్రజలు లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, డ్యాంలవైపు వెళ్లకుండా టామ్ టామ్ వేయించాలని ఆయా అధికారులకు సూచించారు.

వర్షాల కారణంగా తాగు నీరు కలుషితం కావడం , పైప్లైన్ లీకేజీ లను ఎప్పటికప్పుడు అరికట్టేలా సంబంధితఅధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

తాహసిల్దార్లు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ముందస్తు సమాచారాన్ని కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ కు ఎప్పటికప్పుడు అందించాలని, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు.

అగ్నిమాపక శాఖ రెస్క్యూ టీం అలర్ట్ గా ఉండాలన్నారు. మున్సిపాలిటీలలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు . వర్షాల వల్ల పంట నష్టం జరిగితే వెంటనే తెలియజేయాలని , వైద్యులు, ఆశా వర్కర్లు ,ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండి,అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని , గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటూ,అప్రమత్తంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

విద్యుత్ పోల్స్ , తెగిపోయిన వైర్ల వలన ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు.

అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది వారి వారి హెడ్ క్వార్టర్ లో అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా యంత్రాంగం ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండి అవసరమైన సహాయాన్ని అందిస్తుందని, ఎలాంటి భయాందోళనలకు గురికా వద్దని కలెక్టర్ ప్రజలకు భరోసా నిచ్చారు.

## నిరంతర వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

### -జిల్లా కలెక్టర్లకు ఆదేశించిన సి.ఎస్. సోమేశ్ కుమార్



సంగారెడ్డి, జూలై 11 (నేటి నిజం ప్రతినిధి) రాష్ట్రంలో గత మూడు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నుండి ఆదివారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సి ఎస్ మాట్లాడుతూ, రానున్న మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, చెరువుల వద్ద ప్రత్యేక సంరక్షిత చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ జిల్లా కలెక్టరేట్ లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఇప్పటికే నిండిన అన్ని చెరువులు, కుంటల వద్ద ముందు జాగ్రత్తగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. ఎక్కడైనా రోడ్లు దెబ్బతింటే వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు.

గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను పరిశుభ్రం చేయాలని, అంటువ్యాధులు ప్రబలకుండా తగు రసాయన పదార్థాలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమీషనర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాలో నిన్నటి వరకు సరాసరి వర్షపాతం 44.9 మి.మీ. గా నమోదయిందని, ఇది జిల్లాలో పంటలకు అవసరమైన మంచి వర్షపాతమని సి ఎస్.కు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని, అన్ని విధాల కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. కలెక్టరేట్లో ప్రతీక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజల్ని అప్రమత్తం చేయడంతో పాటు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై పూర్తిస్థాయిలో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాల చర్యలు చేపడుతున్నారని తెలిపారు. పోలీస్ శాఖ తో సమన్వయం చేసుకుని ముందుకు వెళుతున్నామని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జిల్లా ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ఆర్ఐఎన్ఎల్ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఐకానిక్ వారోత్సవాలు

న్యూఢిల్లీ, జులై 11: 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ జూలై 4 నుండి 10, 2022 వరకు పాటిస్తున్న ఐకానిక్ వారోత్సవంలో భాగంగా ఆర్ఐఎన్ఎల్ కార్పొరేట్ సంస్థ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. వారం రోజుల పాటు కొనసాగిన ఈ ఆర్ఐఎన్ఎల్ ఐకానిక్ వారోత్సవాలలో ఉక్కుపై అవగాహన కల్పించే విధంగా ఈ రోజు పాఠశాల విద్యార్థులచే బీచ్ రోడ్డులో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంతో వారోత్సవాలు ముగిశాయి. విశాఖపట్నం స్టీల్ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్-కార్పొరేట్ సర్వీసెస్) జి. గాంధీ, స్పోర్ట్స్ జనరల్ మేనేజర్ ఎంఎస్ కుమార్, చీఫ్ జనరల్ మేనేజర్ ఫైనాన్స్ శాంత కుమార్, ఆర్పి శర్మ (కార్పొరేట్ కమ్యూనికేషన్స్) ఐ/సీ ఈ వాకథాన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ గుర్తింపు పొందిన కార్మిక సంఘం అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు కూడా పాల్గొన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా ఉక్కు మంత్రిత్వ శాఖ జూలై 4 నుండి 10 2022 వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన వార్షికోత్సవంలో భాగంగా విశాఖ ఉక్కు కర్మాగారం జూలై 4 నుండి 10 వరకు ఐకానిక్ అనేక కార్యక్రమాలను నిర్వహించింది.

ఐకానిక్ వీక్‌లో భాగంగా మొబైల్ ఎగ్జిబిషన్-టేబ్లియన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో దేశ నిర్మాణం, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా వాటి అమలు వివిధ జాతి విజయాలు దేశ నిర్మాణంలో వివిధ ప్రతిష్ఠాత్మక భారీ ప్రాజెక్ట్‌లలో వాటి వినియోగాలలో ఆర్ఐఎన్ఎల్ పాత్రను ప్రదర్శించారు. ఉక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో ఇది పర్యటించింది. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఈ వారోత్సవాన్ని జన-ఉత్సవ్‌గా జరుపుకుంటున్నందున అన్ని కార్యకలాపాలు జన్-భాగిదారి (ప్రజల భాగస్వామ్యం) యొక్క సరైన స్ఫూర్తితో అమలు చేయబడ్డాయి. అంతే కాకుండా ఈ వారోత్సవాలలో భాగంగా వివిధ శాఖలు, టౌన్‌షిప్‌లు, బయట గనుల కార్యాలయాల్లో ఉద్యోగులు మొక్కలు నాటడం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ఉత్సాహంగా చేపట్టారు. ఆర్ఐఎన్ఎల్ భద్రత ఇంజనీరింగ్ విభాగం మొత్తం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లోనే కాకుండా వైజాగ్ వెలుపల ఉన్న ఆర్ఐఎన్ఎల్ యొక్క మైన్స్ యూనిట్‌లలో కూడా అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, పాదయాత్రలు మరియు నినాదాల ద్వారా భద్రత సంబంధిత అంశాలను ప్రచారం చేసింది. సురక్షిత ఉక్కు తయారీ మరియు భద్రత ఓ ఆరోగ్యం గురించి స్థానిక మరియు ప్రపంచ నాణ్యతా పద్ధతులను పంచుకోవడం పట్ల భద్రతా అవగాహన ప్రచారం మరియు "జీరో యాక్సిడెంట్ ఇన్సిడెంట్స్" సాధించే దిశగా అవగాహన కార్యక్రమాలు కూడా ఈ సందర్భంగా నిర్వహించబడ్డాయి.

ఉక్కు వినియోగాన్ని నిర్ధారించడానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఉక్కు వినియోగాన్ని ప్రోత్సహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై

ఐఎన్ఎస్‌డీఏజీ మద్దతుతో ఒక సెమినార్ కూడా నిర్వహించబడింది. పర్యావరణం మరియు సుస్థిరతపై పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం/ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం మరియు దాని ఉక్కునగరం టౌన్‌షిప్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించే దిశగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం తీసుకున్న అనేక చర్యలలో భాగంగా స్టీల్ సిటీ ప్రజలకు జౌళి బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మహానగర పాలక సంస్థ జోనల్ కమిషనర్ పి సింహాచలం, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు పాల్గొని విశాఖ స్టీల్ ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం దిశగా విశాఖ ఉక్కు యాజమాన్యం చేపడుతున్న పలు కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డా.బి.వి.సత్యవతి, గాజువాక ఎమ్మెల్యే శ్రీ.తిప్పల నాగిరెడ్డి ఐకానిక్ వీక్‌ను గ్రాండ్‌గా విజయవంతం చేయడంలో ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఆర్ఐఎన్ఎల్ ఐకానిక్ వీక్ సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నందుకు మొత్తం సంస్థ సోదర వర్గాన్ని, వివిధ కార్మిక సంఘాలు, పార్లమెంట్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు, అధికారులు, విద్యార్థులు, విక్రేతలు మరియు స్థానిక ప్రజలకు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ .సీఎండీ శ్రీ అతుల్ భట్ అభినందనలు తెలిపారు..

## వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి పువ్వాడ..



ఖమ్మం, జులై 11 (నేటి నిజం ప్రతినిధి) :రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు.

ఈ మేరకు ఖమ్మం కాల్వ ఒడ్డు మున్నేరు పరివాహక ప్రాంతాన్ని మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి సందర్శించారు.

మున్నేరు వరద ఉధృతిని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

ప్రస్తుతం ఎలాంటి ముప్పు లేదని, వరద ఉధృతం అయితే వరద ముంపు ప్రాంతాల వారిని స్థానిక నాయబజార్ కళాశాలలో పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. వారికి భోజనం, తాగునీరు, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు వరద ఉధృతిపై సహాయక చర్యలకై అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలగలేదని, అయినప్పటికీ అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉన్నామని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే పొంగుతున్న వాగుల వద్ద తగు హెచ్చరికలను, ప్రత్యామ్నాయ దారులను సూచించే గుర్తులు ఏర్పాటు చేశామన్నారు.

అదేవిధంగా వర్షకాలంలో గ్రామాల మధ్య ఉన్న చిన్నచిన్న వాగులను దాటే ప్రయత్నం చేయొద్దని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మధ్యాహ్నం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా వరద ఉధృతిని పరిశీలించనున్నామని, అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వరద ఉధృతి, సహాయక చర్యలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

వారి వెంట సుడా చైర్మన్ బచ్చు విజయ్, ఆర్డీవో రవీంద్రనాథ్, ఇరిగేషన్ డిఈ ఉదయ్ ప్రతాప్, తాసిల్దార్ శైలజ, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## ప్రాజెక్టుల అనుసంధానంతో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయి : స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



కామారెడ్డి, జులై 11: కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలంలో గల పోచారం ప్రాజెక్టు నుంచి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయన్నారు. ప్రాజెక్టుల అనుసంధానంతో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాలతో గ్రామాల చెరువుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చెరువులను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ఇన్ స్పెక్టర్ నాగేశ్వరరావు కేసులో కీలక విషయాలు..

హైదరాబాద్, జులై 11:ఇన్ స్పెక్టర్ నాగేశ్వరరావు కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. నాగేశ్వరరావు వాడిన రివాల్వర్ ను పోలీసులు సీజ్ చేశారు. బాధితురాలిపై తుపాకీ గురిపెట్టి నాగేశ్వరరావు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితు??లి ఇంటి దగ్గర నుంచి ఇబ్రహీంపట్నం వరకు పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. మారేడ్ పల్లి పోలీస్ స్టేషన్ నుంచి సీసీ ఫుటేజ్ స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల వాగ్మూలాన్ని పోలీసులు రికార్డు చేశారు. అలాగే బాధితురాలి ఇంటి దగ్గర సీసీ ఫుటేజీ స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు, భర్త స్టేట్ మెంట్లను పోలీసులు రికార్డు చేశారు. ఇన్ స్పెక్టర్ నాగేశ్వరరావుకు వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. హయత్ నగర్ కోర్టుకు నాగేశ్వరరావును తరలించారు.

# గోదారమ్మ మహోగ్రరూపం.. భద్రచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ!

హైదరాబాద్, జులై 11:భారీ వర్షాలు, వరదలతో గోదారమ్మ మహోగ్ర రూపం దాల్చింది. నదిలోకి వరద పోటెత్తడంతో భద్రాచలం వద్ద అంతకంతకూ నీటిమట్టం పెరుగుతోంది. ఉదయం 9గంటల సమయంలో 49 అడుగులు దాటిన వరద ఉధృతి.. సాయంత్రం 4 గంటలకు 53అడుగులకు చేరింది. మరికొన్ని గంటల్లో ఇంకా ప్రమాద స్థాయికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నదిలో వరద ప్రవాహం భారీగా పెరగడంతో స్నానఘట్టాలు మునిగిపోయాయి. నది దిగువన ఉన్న ముంపు మండలాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# కొండకోనలు, వరదలను దాటుకుని.. సురక్షితంగా ఆస్పత్రికి చేరిన గర్భిణులు





వరంగల్, జులై 11: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అడవిలో ఉన్న పలిమేలకు జిల్లా కేంద్రానికి సంబంధాలు తెగిపోయాయి. పెద్దంపేట వాగు వద్ద వరద తాకిడికి రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మండలం లెంకెలగడ్డ, సర్వాయిపేటకు చెందిన గర్భిణులకు పురిటి నొప్పులు రావడంతో కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించారు. దీంతో స్పందించిన కలెక్టర్ భావేశ్ మిశ్రా, అధికార యంత్రాంగం ఎన్డీఆర్ఎఫ్ బృందంతో పెద్దంపేట వాగు వద్దకు చేరుకున్నారు.

వైద్య సిబ్బంది మొదట వాగు దాటి పరీక్షలు నిర్వహించిన అనంతరం లెంకలగడ్డకు చెందిన మడప పుష్పలత , సర్వాయిపేటకు చెందిన పాగే రాధిక అనే ఇద్దరు గర్భిణులను ఆస్పత్రికి తరలించాలని సూచించారు. దీంతో ఎన్డీఆర్ ఎఫ్ బృందం, స్థానిక ప్రజలతో కలిసి వారిని సురక్షితంగా పెద్దంపేట బ్రిడ్జి దాటించి మహాదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. ఇప్పుడు వారు ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ పొందుతున్నట్టు సమాచారం.

# శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి.. వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి, జులై 11: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఎప్పటిలా వైభవంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు టీటీడీ పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈరోజు టీటీడీ పాలకమండలి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. రెండున్నరేళ్ల తరువాతసెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆనందనిలయం బంగారు తాపడం పనులకు ఆగమ పండితుల సలహాల మేరకు మరో నెలలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బాలాలయం చేయడం వీలుకాదు కాబట్టి, టెక్నాలజీని వినియోగించి తాపడం పనులు నిర్వహించడంపై పరిశీలన చేస్తున్నామన్నారు. తిరుమలలో అక్టోపస్ భవన నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న విధంగానేసర్వదర్శన విధానం కొనసాగుతుందన్నారు. ఎస్.ఎస్.డి టోకన్లు జారీ పునరుద్ధరణపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జూలై 24 నుండి నెల్లూరు నగరంలో శ్రీవారి వైభవోత్సవాలు జరుగుతాయన్నారు.

రూ.2.07కోట్లతో నూతన పారువేట మండపం నిర్మాణం, రూ.7.30 కోట్లతో ఎస్వీ గోశాలలో పశుగ్రాసం కొనుగోలుకు టెండర్ ఖరారు, అమరావతి శ్రీవారి ఆలయంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి రూ.2.09 కోట్లు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బేడీ ఆంజనేయస్వామి మూలమూర్తికి ఉన్న రాగి కవచానికి బంగారు తాపడానికి రూ.18.75 లక్షలు మంజూరు, తిరుమలలోని ఎస్వీ పాఠశాలను సింఘానియా ఎడ్యుకేషన్ ముంబై ద్వారా మోడర్న్ స్కూల్ ను రూపొందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 8 రకాల టీటీడీ క్యాలండర్ లు, డైరీలు ముద్రణకు టెండర్ ఆహ్వానం, రామానాథా గుహ అనే ఎన్ఆర్ఐ భక్తుడు బెంగళూరులోని రూ.3.20 కోట్లు విలువ చేసే అపార్ట్ మెంట్ విరాళం ఇచ్చినట్లు తెలిపారు. రూ.4.42 కోట్లతో తిరుపతిలో స్విమ్స్ ఆసుపత్రి ఐటి డెవలప్ మెంట్, శ్రీవారి ఆలయ పోటు మోడ్రనైజడ్ చేయాలని నిర్ణయించామన్నారు. ఆస్ట్రేలియా, స్విజర్లాండ్ కు చెందిమ కంపెనీల సహకారంతో మానవరహిత బుంది తయారీ విధానం పరిశీలన, ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా 12 రకాల గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.

# ప్రత్యర్థి ఆర్థిక వనరుపై దాడి.. 350 చీనీ చెట్ల నరికివేత..

అమరావతి, జులై 11: అనంతపురం జిల్లా నేతలు, ఫ్యాక్షన్ ను వదిలి పెట్టి ఆర్థిక వనరులపై దెబ్బకొట్టే కొత్త పంథాను ఎంచుకున్నారు. జిల్లాలో గతంలో ఫ్యాక్షన్ నాయకులు ఒకరిపై ఒకరు ముఖా ముఖి దాడులకు పాల్పడే వారు. ఆ సంప్రదాయానికి స్వస్తి పలికి కొత్త పంథాను ఎంచుకున్నారు. ఎవరైతే తమకు విరోధులుగా ఉంటారో వారిని పూర్తిగా దెబ్బకొట్టేందుకు ఆర్థిక వనరులపై దాడులకు పూనుకుంటున్నారు.

ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ఆ ప్రభుత్వానికి సంబంధించిన ఫ్యాక్షనిస్టులు ప్రత్యర్థులపై చేయి ప్రదర్శిస్తున్నారు. ఆర్థిక మూలాలను దెబ్బ కొడితే మొత్తం అతని కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంది. ఇందులో భాగంగానే ముఖ్యంగా తాడిపత్రి, సింగనమల, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఎక్కువగా చెట్లు నరికే సాంప్రదాయం కొనసాగుతోంది. తాజాగా.. నార్పల మండలం నడిమిపల్లి గ్రామంలో భాస్కర్ నాయుడు అనే రైతుకు చెందిన 350 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు.

గ్రామంలో ఇతనికి ప్రత్యర్థులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చీనీ మొక్కలు నాటిన తర్వాత ఐదు సంవత్సరాలకు కాపు వస్తుంది. 20 నుంచి 30 సంవత్సరాల దాకా రైతుకు పంట చేతికి వస్తుంది. సంవత్సరానికి రెండు పంటలు వస్తాయి. సీజన్, గై రంగం అని రెండుసార్లు పంట వస్తుంది. ప్రతి ఎకరాకి నికరంగా 10 టన్నులకు పైగా దిగుబడి వస్తుంది.

మార్కెట్ బాగా ఉన్నప్పుడు, 30 వేల నుంచి లక్ష రూపాయలు దాకా అమ్ముడు పోతుంది. సంవత్సరానికి రెండు పంటలు రూపంలో పది టన్నుల లెక్కన చూస్తే 6 నుంచి 10 లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది. పంటపై పెద్దగా ఖర్చు రాదు. ఇంత ఆదాయం వస్తున్న పంట వల్ల రైతు ఆనందంగా ఉంటారు. అనంతపురం సంబంధించిన చీని కాయలు మార్కెట్ లో మంచి గిరాకీతో అమ్ముడుపోతాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అనంతపురం బత్తాయికి బడా నగరాలలో ప్రముఖ ప్రాధాన్యత ఉంది. దీంతో ఫ్యాక్షన్ నాయకులు తమ ప్రత్యర్థులను దెబ్బకొట్టేందుకు ముఖ్యంగా ఆర్థిక వనరులను దెబ్బతీసేందుకు పూనుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ భవిష్యత్తులో ఎన్ని పంటలు నేలకు ఒరుగు తాయో వేచి చూడాల్సిందే.

# విజయవంతంగా గనులను వేలం వేసినందుకు ప్రోత్సాహకాలను అందుకోనున్న రాష్ట్రాలు - మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ, జులై 11: గనులను విజయవంతంగా వేలం వేసిన, సంభావ్య ఖనిజ బ్లాకులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు కేంద్ర బొగ్గు, గనుల, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషీ చెప్పారు. గనుల రంగంలో మరింత మెరుగైన పనితీరు చూపేలా ఇది ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించనున్న గనులు ఢ ఖనిజాలపై జాతీయ సదస్సులో విజయవంతమైన రాష్ట్రాలకు రివార్డులు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత మహోత్సవ్ ప్రతిష్ఠాత్మక వారోత్సవాలను మంగళవారం ఇక్కడ శ్రీ ప్రహ్లాద్ జోషీ ఆరంభించారు. ఒకరోజు జరుగనున్న జాతీయ సదస్సులో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఈ ప్రతిష్ఠాత్మక వారోత్సవాలను దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలు / మంత్రిత్వ శాఖ ఆధీన కార్యాలయాలు 11 నుంచి 17 జులై వరకు జరుపుకుంటాయని ఏకెఏఎం ప్రతిష్ఠాత్మక వారోత్సవాలలో పాలుపంచుకున్న గనుల శాఖ కార్యదర్శి శ్రీ అలోక్ టాండన్ తెలిపారు.

గనులను విజయవంతంగా వేలం వేసిన, సంభావ్య ఖనిజ బ్లాకులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు కేంద్ర బొగ్గు, గనుల, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషీ చెప్పారు.

గనుల రంగంలో మరింత మెరుగైన పనితీరు చూపేలా ఇది ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించనున్న గనులు ఢ ఖనిజాలపై జాతీయ సదస్సులో విజయవంతమైన రాష్ట్రాలకు రివార్డులు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత మహోత్సవ్ ప్రతిష్ఠాత్మక వారోత్సవాలను మంగళవారం ఇక్కడ శ్రీ ప్రహ్లాద్ జోషీ ఆరంభించారు. ఒకరోజు జరుగనున్న జాతీయ సదస్సులో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఈ ప్రతిష్ఠాత్మక వారోత్సవాలను దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలు / మంత్రిత్వ శాఖ ఆధీన కార్యాలయాలు 11 నుంచి 17 జులై వరకు జరుపుకుంటాయని ఏకెఏఎం ప్రతిష్ఠాత్మక వారోత్సవాలలో పాలుపంచుకున్న గనుల శాఖ కార్యదర్శి శ్రీ అలోక్ టాండన్ తెలిపారు.

# వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి..!

**-పాత ఇళ్ళు, పునరావాస కేంద్రాలను గుర్తించాలి**
**-సమీక్ష సమావేశంలో మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి రోనాల్డ్ రోస్.**

మెదక్ జులై 11 (నేటి నిజం ప్రతినిధి) మెదక్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ 08452?223360 కంట్రోల్ రూమ్‌లో ఇరవై నాలుగు గంటల పాటు అందుబాటులో ఉండేలా అవసరమైన



ప్రత్యేక అధికారి రోనాల్ రోస్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ హరీశ్, ఎస్పీ రోహిణి ప్రియదర్శినిలతో పాటు అన్ని శాఖల అధికారులతో జిల్లా వీడియో కాన్ఫరెన్స్? సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాల నేపథ్యంలో జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్ రెవెన్యూ డివిజన్‌లలో చెక్‌డ్యామ్‌లు ఎక్కడ ఉన్నాయి ఎక్కడ నుంచి నీటి ప్రవాహం వస్తుందనే వివరాలను అడిగి తెలుసుకొన్నారు. జిల్లా కేంద్రంలోని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎప్పటికప్పుడు వర్షాభావ పరిస్థితులు, వర్షపాతం వివరాలను తెలియచేయడంతో పాటు ఎక్కడైనా శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్ళు, ఇతర భవనాలను గుర్తించాలని ప్రత్యేక అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఉంటే సిబ్బందిని పంపించి వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. విద్యుత్తు సబ్‌స్టేషన్ల వద్ద విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, స్తంభాలు, కరెంట్ వైర్లను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖ సిబ్బంది పరిశీలించేలా వారికి తెలియజేయాలని ట్రాన్స్‌కో అధికారులకు వివరించారు. దీంతో పాటు అందరికీ వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని... వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తమ సేవలను అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి రోనాల్డ్ రోస్ వివరించారు. వర్షాల వల్ల నీరు కలుషితమవుతుందని దీనికి గాను తాగునీరందించే విషయంలో మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని... కలుషిత నీరు రాకుండా మంచినీరు అందించేలా చూడాలని ఈ విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని ఆదేశించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎక్కడైనా ఏదైనా ఇబ్బందికర సంఘటన జరిగితే వెంటనే చేరుకునేలా, సహాయక చర్యలు చేపట్టేలా పూర్తిస్థాయిలో పోలీసులు ఉండాలని తెలిపారు. చెక్‌డ్యామ్‌లలో నీటి ప్రవాహం ఎంత ఉందనే వివరాలను సంబంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రేషన్ దుకాణాలకు సంబంధించి బియ్యం ముందుగానే స్టాక్ పాయింట్‌లకు చేరుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి రోనాల్డ్ రోస్ సూచించారు. ప్రజలు కూడా జిల్లా అధికారులకు సహకరించాలని... వర్షాల వల్ల తమ ప్రాంతంలో ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారులకు, పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరీశ్, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు రమేష్, ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో వెంకట శైలేష్, డీపీవో తరుణ్ కుమార్, డీఎస్‌వో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్ఈ జానకీరామ్, నీటి పారుదల, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు, మెదక్, నర్సాపూర్, తూప్రాన్, ఆర్డీవోలు సాయిరామ్, వెంకట ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాశ్, మెదక్ డీఎస్పీ సైదులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ విద్యాలయలో జిల్లా అగ్ర భాగాన నిలవాలి..... -జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్




సంగారెడ్డి, జూలై 11(నేటి నిజం ప్రతినిధి) స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ లో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు.

కలెక్టరేట్ సమావేశ మంది రంలో సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత విద్యాలయ పురస్కారం జిల్లా సాయి అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. స్వచ్ఛ విద్యాలయ పురస్కారం 2021-22 జిల్లా స్థాయిలో ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశంస పత్రాలను కలెక్టర్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. పరిశుభ్రత పచ్చదనం పెరిగితే ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందన్నారు.

అన్ని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రతకు ,పచ్చదనానికి నిదర్శనంగా స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. స్వచ్ఛత అవార్డు పొందిన పాఠశాలలు మిగతా పాఠశాలలకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి పాఠశాలలో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంచేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు.

అన్ని పాఠశాలలో విరివిగా ప్లాంటేషన్ జరగాలన్నారు. అన్ని పాఠశాలల్లో వాచ్ అండ్ వార్డు పెట్టాలని సూచించారు. పల్లె ప్రగతి స్ఫూర్తితో ప్రత్యేక శ్రద్ధతో గ్యాప్స్ పూర్తి చేయాలని ఆయన కోరారు.

ప్రతి పాఠశాలలో స్వచ్ఛత నియమాలు పాటించాలని కోరారు. స్వచ్ఛ పురస్కారాలకు ఎంపికైన 37 పాఠశాలల ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి,రాజార్శి షా, జిల్లా విద్యాధికారి రాజేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ సాగర్, కిసాన్ సాగర్ చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



సంగారెడ్డి, జూలై 11(నేటి నిజం ప్రతినిధి) ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం ఆయన జిల్లా ఎస్పీ, అధనపు కలెక్టర్ తో కలిసి జిల్లా కేంద్రంలోని మహబూబ్ సాగర్, కందిలోని కిసాన్ సాగర్ చెరువులను పరిశీలించారు.

జిల్లా కేంద్రంలో అలుగు పారుతున్న మహబూబ్ సాగర్ చెరువును పరిశీలించిన కలెక్టర్, చెరువు కింద గల కాలువ గడ్డి, గుర్రపు డెక్క తదితరాలతో పూడుకొని ఉండటాన్ని గమనించి, వెంటనే పూడిక తీసి నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆయా అధికారులు వెంటనే కాల్వపూడిక తొలగించి వర్షం నీళ్లు సాఫీగా వెళ్ళేలా పనులు పూర్తి చేశారు.

చెరువు అలుగు పారుతున్నందున ప్రజలు తిలకించడానికి వచ్చే అవకాశం ఉందని, చెరువు కట్ట పైకి ఎవరిని అనుమతించవద్దని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు.

అనంతరం కంది జాతీయ రహదారి (ఐఐటి పక్కన) పక్కన గల హోటల్ యాజమాన్యం చెరువు కట్టు కాలువను ఆక్రమించి పార్కింగ్ చేసుకోవడంపై ఆగ్రహించిన కలెక్టర్ వెంటనే పార్కింగ్ తొలగించి కాల్వ పూడిక తీయాలని నీటిపారుదల ,పోలీస్ శాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత అధికారులు రంగంలోకి దిగి పార్కింగ్ స్థలాన్ని తొలగించి, కాలువను ఓపెన్ చేశారు. అదేవిధంగా ఐఐటీలో కూడా మూసి వేసిన కట్టు కాలువను తిరిగి ఓపెన్ చేయాలని ఐఐటి ఎస్. ఈ కి కలెక్టర్ సూచించారు. చెరువు కట్టు కాలువలను ఆక్రమించితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ రమణ కుమార్, అధినపు కలెక్టర్ వీరారెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్.ఈ. మురళీధర్, ఈఈ మధుసూదన్ రెడ్డి, డి ఈ బాల గణేష్, డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, సిఐ రమేష్, సంగారెడ్డి ,కంది తహసిల్దార్లు స్వామి ,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఏటూరునాగారం ఏరియాలో మంత్రి, ఎంపీ పర్యటన



వరంగల్, జులై 11: మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత ములుగు జిల్లా ఏటూరునాగారం, వాజేడు మండలాల్లో ఇవ్వాల (సోమవారం) పర్యటించారు. గోదావరి నది పరివాహక వరద ముంపు గ్రామాలను వారు పరిశీలించారు. ఓవైపు జోరుగా వర్షం కురుస్తుండడంతో గొడుగులు పట్టుకొని పూసూరు వంతెన వద్దకు వచ్చి గోదారి ఉధృతిని పరిశీలించారు. గోదావరి వరదల సమయంలో అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట మండలాల ప్రజలకు గోదావరి వరద ప్రభావం ఎక్కువగా ఉంటుంది కనుక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గోదావరి ప్రభావిత వరద ముంపు బాధితులకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి, ఎంపీ అధికారులకు సూచించారు. వరదల సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలాల వారీగా అధికారులతో ఎప్పటికప్పుడు వరదలపై సమీక్షిస్తూ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ములుగు కలెక్టర్ ను కోరారు. పూసూరుగోదావరిని సందర్శించిన ఆమె గోదావరిలో కాయిన్స్ వేసి దండం పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ములుగు కలెక్టర్ కృష్ణాదిత్య, మండల స్పెషల్ ఆఫీసర్ సర్దార్ సింగ్, వాజేడు తాసిల్దార్ గూడూరు లక్ష్మణ్, ఎంపీడీవో విజయ తదితరులున్నారు.

# రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు చంద్రబాబు మద్దతు.

అమరావతి, జులై 11: ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు తెలుగుదేశం అధినేత, ఏపీ మాజీ సీఎం చంద్రబాబు మద్దతు పలికారు. దేశానికి తొలి గిరిజన మహిళ రాష్ట్రపతి కావడం వల్ల ముర్ముకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు చంద్రబాబు సోమవారం తెలిపారు. దీంతో రాష్ట్రంలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ప్రకటించినట్టు అయ్యింది. టీడీపీకి లోక్‌సభలో ముగ్గురు ఎంపీలు, రాష్ట్ర అసెంబ్లీలో 23 మంది ఎమ్మెల్యేలున్నారు. కాగా, వైఎస్సార్‌సీపీకి 22 మంది ఎంపీలు, 151 మంది ఎమ్మెల్యేలున్నారు.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ.. రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తొలి ఆదివాసీ మహిళ కావడంతో ఆమెకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం.. దీనిపై ఇంకేమీ ఆలోచించలేదు అన్నారు. అయితే.. 2017లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వనందున ఎన్డీఏ కూటమి నుంచి ఆ పార్టీ బయటకు వచ్చింది. 2019లో రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటి నుండి చంద్రబాబు బీజేపీకి సానుకూలంగా మాట్లాడుతూ వస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ మిత్రపక్షమైన జనసేనకు కూడా ఆయన అనుకూలంగా ఉంటున్నారు.

# 13న విశాఖలో సీఎం జగన్ పర్యటన

అమరావతి, జులై 11: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఆ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 13వ తేదీన సీఎం జగన్ విశాఖలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా వాహనమిత్ర లబ్ధిదారులతో సమావేశమై వారికి చెక్కులను పంపిణీ చేయనున్నారు. అలాగే వాహనమిత్ర లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం ఫొటో సెషన్ ఉంటుంది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలిస్తారు. ఆ తర్వాత అక్కడి బహిరంగ సభలో జగన్ ప్రసంగిస్తారు. సమావేశంలో లబ్దిదారులకు చెక్కులు అందజేయనున్నారు.

# దళితులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

హైదరాబాద్, జులై 11: దేశంలో ఎక్కడ లేని విధంగా దళితులను కోటీశ్వరులను చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డా ప్రాంతానికి చెందిన లబ్ధిదారుడు శ్రీనివాస్ దళితబంధు పథకం ద్వారా నింబోలిఅడ్డాలో ఆదివారం ఏర్పాటు చేసిన కిరణాషాపును ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించాడు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దళితులు ఆర్థికంగా ఎదిగి, వారి కుటుంబాలల్లో వెలుగులు నింపేందుకే సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని తెలంగాణ వ్యాప్తంగా అమలు చేస్తున్నాడని అన్నారు. దళితబంధు పథకంతో ఏర్పాటు చేసుకున్న వ్యాపారాల ద్వారా మరో జీవితానికి శ్రీకారం చుట్టాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల బతుకులు మారాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్ దళితబంధు పథకం ప్రవేశపెట్టాడని, ఈ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, సునీల్‌బిడ్లాన్, కన్నె రమేశ్‌యాదవ్, కాచిగూడ టీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, ప్రధాన కార్యదర్శి సదానంద్, డాక్టర్ ఓంప్రకాశ్‌యాదవ్, బి.కృష్ణాగౌడ్, విజితారెడ్డి, దాత్రిక్ నాగేందర్‌బాబ్జి, శేషుపేరి, మహేశ్‌కుమార్,బబ్లూ, అంటోని, రామచంద్రరాజు, ఎల్. రమేశ్, పట్లూరి సతీశ్, భీంరాజ్ పాల్గొన్నారు.

సంచార జాతుల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 16వ తేదీన ఇందిరాపార్కు వద్ద నిర్వహించబోయే సంచార జాతుల మహాధర్నా పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆవిష్కరించారు. ఆ ధర్నాకు హాజరు కావాలని కూడా ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, అధ్యయన కమిటీ చైర్మన్ వెంకటనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగజోగి శ్రీనివాస్, నాయకులు సరికొండ సమ్మయ్య పాల్గొన్నారు.



# కర్నాటకలో ఆపరేషన్ కమలం ఫలించదు : సిద్ధరామయ్య



బెంగళూర్, జులై 11: కోట్లు కుమ్మరించి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్న బీజేపీపై కర్నాటక మాజీ సీఎం, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య మండిపడ్డారు. కాషాయ పార్టీ చేపట్టిన ఆపరేషన్ కమలం కర్నాటకలో ఫలించదని అన్నారు. గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రూ 40 కోట్లతో కాషాయ పార్టీ ప్రలోభాలకు గురిచేసి తమ వైపునకు తిప్పుకుంటోందనే వార్తలపై సిద్ధరామయ్య స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేని బీజేపీ ప్రతి ఎమ్మెల్యేలను రూ 50 కోట్లతో కొనుగోలు చేసేందుకు సిద్ధమైందని అన్నారు. గోవాలోనే కాదు ప్రతి చోటా వారు (బీజేపీ నేతలు) ఆపరేషన్ కమలానికి తెరలేపుతున్నారు. డబ్బు సంచులు ఎరవేసి ఎమ్మెల్యేలను కొంటున్నారని సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. కర్నాటకలో మాత్రం కమలం నాటకం ఫలించదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలను రూ 40, రూ 50 కోట్లు వెచ్చించి కొనుగోలు చేయడం దేశ ప్రజాస్వామ్య వ్యవస్ధను విచ్చిన్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాంటి చర్యలు దేశంలో చోటుచేసుకోవడం మనందరికీ సిగ్గు చేటని అన్నారు. అయితే కర్నాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. బీజేపీ సహకారంతో పార్టీ ఎమ్మెల్యేలను కాషాయ గూటికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణపై గోవా అసెంబ్లీలో విపక్ష నేత, పార్టీ ఎమ్మెల్యే మైఖేల్ లోబోపై కాంగ్రెస్ పార్టీ వేటు వేసింది.

## ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్ధికి మద్దతివ్వండి- ఉద్ధవ్‌ను కోరిన శివసేన ఎంపీలు

ముంబై, జులై11: మహారాష్ట్ర రాజకీయాల్లో అనిశ్చితి నెలకొన్న తరుణంలో శివసేన ఎంపీలు కీలక ప్రతిపాదన చేశారు. ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతివ్వాలని పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు సూచించారు. అయితే రెండు రోజుల్లో తన నిర్ణయం చెబుతానని ఆయన అన్నారు. శివసేనకు 19 మంది లోక్‌సభ, ముగ్గురు రాజ్యసభ సభ్యులున్నారు. సీఎం ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు నేపథ్యంలో పలువురు ఎంపీలు కూడా ఆయనకు మద్దతిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

ఈ తరుణంలో ఉద్ధవ్ ఠాక్రే పార్టీ ఎంపీలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన నివాసం మాతోశ్రీలో జరిగిన ఈ భేటీకి ఆయన వర్గం అయిన 16 మంది ఎంపీలు హాజరయ్యారు. రాష్ట్రపతి ఎన్నికలపై ఈ సందర్భంగా చర్చించారు. అయితే గిరిజనురాలైన ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతివ్వాలని పార్టీ ఎంపీలు ఉద్ధవ్ ఠాక్రేను కోరారు. మహారాష్ట్రలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్నందున ఆమెకు ఓటు వేద్దామని సూచించారు. దీనిపై తన నిర్ణయాన్ని రెండు రోజుల్లో చెబుతానని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న శివసేన ఎంపీ గజానన్ కీర్తికర్ ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. 'ద్రౌపది ముర్ము ఎన్డీయే అభ్యర్థి. అయితే గిరిజన వర్గానికి చెందిన మహిళ. మనం ఆమెకు మద్దతివ్వాలి. ఇది పార్టీ ఎంపీలందరి డిమాండ్. ఒకటి రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని చెబుతానని ఉద్ధవ్ మాకు చెప్పారు' అని ఏఎన్ఐ వార్తా సంస్థతో ఆయన అన్నారు. మరోవైపు ఎంపీల సమావేశంలో పాల్గొన్న ఉద్ధవ్ ఠాక్రే ప్రధాన అనుచరుడైన సంజయ్ రౌత్, అనంతరం మీడియాతో ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయారు. దీంతో విపక్షాలు బలపర్చిన రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు బదులుగా ఎన్డీయే అభ్యర్థి ముర్ముకు మద్దతివ్వాలన్న ఎంపీల డిమాండ్‌కే ఉద్ధవ్ ఠాక్రే మొగ్గు చూపుతారని తెలుస్తున్నది. అయితే రాష్ట్రపతి ఎన్నికకు పార్టీలు ఎలాంటి విప్ జారీ చేయవు. ఎంపీలు తమ ఇష్టానుసారం నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చు.

## అకాల వర్షాలతో నష్టపోయిన వారికి ఎమ్మెల్యే సహకారంతో సహాయ అందిస్తాం.

-సంగారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చి రాములు.



సంగారెడ్డి జిల్లా 11 ( నేటి నిజం ప్రతినిధి ) సంగారెడ్డి మండలంలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట నీట మునిగి నష్టపోయిన రైతులకు స్థానిక ఎమ్మెల్యే జగ్గారెడ్డి సహకారంతో నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని సంగారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చి రాములు తెలిపారు. సోమవారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తి , కూరగాయలు, వరి, తదితర పంటలు , ఇల్లు, కూలిపోయిన వారి వివరాలు సేకరించి కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులకు లేదా జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి గారికి తెలియజేయాలని కాంగ్రెస్ కార్యకర్తలను ఆయన కోరారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం నీట మునిగి పాడైన పంటలకు , ఇల్లు కూలిపోయిన వారికి , సహాయం అందించే విధంగా చర్యలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుచ్చి రాములు చెప్పారు . ఈ సమావేశంలో సంగారెడ్డి మండలం నాగపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిహెచ్ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి జీతాలు ఇవ్వాలని లేదా కమిషన్లు పెంచాలని డిమాండ్ చేస్తు సంగారెడ్డి జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు నాయి కోటి రాజు అధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట డీలర్ల ధర్నా.

# పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ మరియు బర్ధమాన్‌లలో ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ పాయింట్లు

న్యూఢిల్లీ, జులై 11: కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఒ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహాయమంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ బర్ధమాన్–దుర్గాపూర్ లోక్‌సభ సభ్యుడు శ్రీ ఎస్ఎస్ అహ్లువాలియా సమక్షంలో 10 జూలై 2022న దుర్గాపూర్‌లో ఎన్ఐఎక్స్ఐ చెందిన రెండు కొత్త ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ పాయింట్లను (ఐఎక్స్‌పీ) ప్రారంభించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా విజన్ అయిన ప్రతి భారతీయుడిని ఓపెన్, సురక్షితమైన ఒ విశ్వసనీయ మరియు జవాబుదారీ ఇంటర్నెట్‌తో కనెక్ట్ చేయడం మరియు ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) విజన్ 1000 రోజుల్లో భాగంగా ఈ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీలను ప్రారంభించడం జరిగింది.

ఈ ప్రారంభ కార్యక్రమానికి దుర్గాపూర్ మేయర్ అనిందితా ముఖర్జీ, శ్రీ ప్రదీప్ కేఆర్.మజుందార్, దుర్గాపూర్ ఎమ్మెల్యే పుర్బా, శ్రీ లక్ష్మణ్ చంద్ర ఘోరుయ్, ఎమ్మెల్యే దుర్గాపూర్ పశ్చిమ్ మరియు శ్రీ ఖోకన్ దాస్ ఎమ్మెల్యే బర్ధమాన్ దక్షిణ్ మరియు శ్రీ పరేష్ చంద్ర సర్కార్, బర్ధమాన్ మేయర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు మరియు పౌర సమాజ ప్రతినిధులు హాజరయ్యారు.

రాష్ట్రాలలోని ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీలు పశ్చిమ బెంగాల్ మరియు పొరుగు ప్రాంతాలలో ఇంటర్నెట్ మరియు బ్రాడ్‌బ్యాండ్ సేవలను మెరుగుపరచడానికి దోహదపడతాయని భావిస్తున్నారు. ఐఎస్‌పీలు దాని తుది వినియోగదారులకు అందించే మెరుగైన ఇంటర్నెట్ సేవలతో ప్రయోజనం పొందుతాయి. తద్వారా ప్రజల జీవితాల్లో మార్పును తీసుకువస్తుంది.

ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథి రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ"ఇంటర్నెట్ నేడు అన్ని ఆర్థిక కార్యకలాపాలకు జీవనాధారంగా మారింది. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే పబ్లిక్ మరియు ప్రైవేట్ సర్వీస్‌లను యాక్సెస్ చేయడం చాలా అవసరం. ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీలు పశ్చిమ బెంగాల్‌లోని డిజిటల్ నాగ్రిక్‌లకు మెరుగైన ఇంటర్నెట్ అనుభవాన్ని నిర్ధారిస్తాయి." అని చెప్పారు.

2015లో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రారంభించిన 7 సంవత్సరాల డిజిటల్ ఇండియా కార్యక్రమంపై మంత్రి మాట్లాడుతూ" ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు నేను ప్రేక్షకుల్లో ఉన్నాను. టెక్నాలజీలో దాదాపు 3 దశాబ్దాల అనుభవంతో భారతదేశం ఇంత దూరం ప్రయాణించి డిజిటల్ పవర్‌హౌస్‌గా ఆవిర్భవిస్తుందని నాకు కూడా తెలియదు. నేను 1990లలో భారతదేశపు అతిపెద్ద సెల్యులార్ నెట్‌వర్క్‌ను నిర్మించినప్పుడు, మనం దాదాపు ప్రతి పరికరాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకున్నాము. నేడు మనం 5 జీ నెట్‌వర్క్‌ను ప్రారంభించ బోతున్నందున, భారతదేశంలోని మెజారిటీ భాగాల రూపకల్పన మరియు తయారీకి స్వదేశీ సామర్థ్యాలను అభివృద్ధి చేసాము. మేము టెక్ కన్స్యూమర్ నుండి ప్రపంచంలోని విశ్వసనీయ సాంకేతిక భాగస్వామిగా మారాము " అని వెల్లడించారు.

లోక్‌సభ సభ్యుడు శ్రీ ఎస్.ఎస్ అహ్లువాలియా మాట్లాడుతూ " ఈ రోజు ఇంటర్నెట్ అనేది ఒక కమ్యూనిటీకి వెన్నెముక – వ్యాపారాలు మరియు సేవలతో మాత్రమే కాకుండా ఒకరికొకరు ప్రజలను కలుపుతోంది. బర్ధమాన్ మరియు దుర్గాపూర్‌లో జంట ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్‌ల ప్రారంభోత్సవంలో భాగమైనందుకు నేను గర్వపడుతున్నాను. ఈరోజు ఎన్ఐఎక్స్ఐ ద్వారా దుర్గాపూర్ ఎమ్మెల్యే శ్రీ లక్ష్మణ్ ఘోరుయ్‌తో కలిసి మరియు నియోజకవర్గ ప్రజలకు నేను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి నాకు సహాయం చేసినందుకు గౌరవనీయులైన కేంద్ర మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్‌కి ధన్యవాదాలు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీజీ కలలు కన్న డిజిటల్ ఇండియా మనది మనందరిది. ముఖ్యంగా దేశంలోని ఈ ప్రాంత ప్రజలకు ఫలవంతం కావాలి " అని ఆకాంక్షించారు.

మన గౌరవనీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియాను ప్రతి పౌరుడు అనుసంధానించబడిన భారతదేశంగా ఊహించారు. వారు ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రభుత్వాన్ని యాక్సెస్ చేయగలగడం మరియు విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధితో పాటు వ్యవస్థాపకత కోసం వారికి అవకాశాలను కల్పించాలని ఆకాంక్షించారు.

'డిజిటల్ అంతరాయాలను'ను మనం అధిగమించేలా మరియు మన దేశంలోని అత్యంత మూలలో ఉన్న మన దేశ ప్రజలు ప్రధాని అందించిన మార్గదర్శక నినాదంతో పాటు ఎనేబుల్ చేయడమే కాకుండా, సాధికారత పొందేలా చూడ్డం మా ప్రభుత్వ చొరవ. ప్రధానమంత్రి చేపట్టిన సబ్‌కాసాథ్, సబ్‌కావికాస్, సబ్‌కా విశ్వాస్ మరియు సబ్‌కాప్రయాస్‌లు మనల్ని నడిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా మన 'ఆజాదికా అమృతమహోత్సవ్' జరుపుకునే ముఖ్యమైన యుగంలో రాబోయే దశాబ్దాలుగా ప్రపంచ ప్రకృతి దృశ్యంలో మన దేశానికి స్థానం కల్పిస్తాయి.

ఎన్ఐఎక్స్ఐ గురించి:

ఎన్ఐఎక్స్ఐ అనేది కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 8 ప్రకారం లాభాపేక్ష లేని సంస్థ. 19 జూన్, 2003న నమోదు చేయబడింది. ఎన్ఐఎక్స్ఐ అనేది ఐఎస్‌పీల గురించి ఏర్పాటు చేయబడింది.

దేశీయ ట్రాఫిక్‌ను యూఎస్/విదేశాలకు తీసుకువెళ్లే బదులు దేశంలోని దేశీయ ట్రాఫిక్‌ను రూట్ చేయడం దీని ఉద్దేశ్యం. తద్వారా అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను ఆదా చేయడం ద్వారా ఐఎస్‌పీల కోసం మెరుగైన నాణ్యత సేవ (తగ్గిన జాప్యం) మరియు బ్యాండ్‌విడ్త్ ఛార్జీలు తగ్గుతాయి. ఎన్ఐఎక్స్ఐ తటస్థ ప్రాతిపదికన ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాల కోసం ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా నిర్వహించబడుతుంది.

# 2023 నాటికి దేశంలో పట్టణ ప్రాంతంలో మొట్టమొదటి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారి-శ్రీ నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, జులై 11: హర్యానాలోని ద్వారకా ఎక్స్‌ప్రెస్ రహదారిని దేశంలో మొట్టమొదటి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారిగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితీష్ గడ్కరీ వెల్లడించారు.

ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారిగా రూపుదిద్దుకోనున్న ద్వారకా ఎక్స్‌ప్రెస్ వల్ల ఢిల్లీ–గుర్గావ్ ఎక్స్‌ప్రెస్ రహదారి (స్వర్ణ చతుర్భుజంలోని ఢిల్లీ–జైపూర్–అహ్మదాబాద్–ముంబై విభాగంలో భాగం)పై వాహన ఒత్తిడి తగ్గుతుందని శ్రీ గడ్కరీ ట్వీట్ చేశారు. ఢిల్లీ–గుర్గావ్ ఎక్స్‌ప్రెస్ రహదారి గుండా పశ్చిమ ఢిల్లీ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే వాహనాల వల్ల విపరీతమైన రద్దీ ఏర్పడుతూ తరచు వాహనాలు నిలిచిపోతున్నాయి. జాతీయ రహదారి 8 మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాల్లో 50% నుంచి 60% కొత్తగా నిర్మిస్తున్న రహదారిపైకి మళ్లిస్తామని శ్రీ గడ్కరీ వివరించారు. దీనివల్ల సోహ్నా రోడ్డు, గోల్ఫ్ కోర్స్ రోడ్, ఎయిర్ ఎక్స్‌టెన్షన్ మార్గాల్లో ట్రాఫిక్ పరిస్థితి మెరుగుపడుతుందని మంత్రి పేర్కొన్నారు. 2023లో ప్రారంభమయ్యే నూతన ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారితో ఢిల్లీ–ఎన్ సీ ఆర్ మార్గంలో వాతావరణ కాలుష్యం గణనీయంగా తగ్గుతుందని శ్రీ గడ్కరీ అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రపంచ ప్రమాణాలతో రహదారులను అభివృద్ధి చేసే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నదని శ్రీ గడ్కరీ తెలిపారు. దేశంలో అన్ని ప్రాంతాలను రహదారులతో అనుసంధానం చేసి అనుసంధానం ద్వారా అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని అన్నారు.

ఢిల్లీలోని ద్వారకా నుంచి హర్యానాలోని గురుగాం వరకు 29 కిలోమీటర్ల పొడవైన ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం చురుగ్గా సాగుతోంది. రహదారిలో 19 కిలోమీటర్ల మార్గం హర్యానాలో, మిగిలిన 10 కిలోమీటర్లు ఢిల్లీలో ఉంటాయి. దీనికి 9,000 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని అంచనా వేశారు.

16–లేన్ యాక్సెస్–నియంత్రిత హైవేగా ద్వారకా ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని శ్రీ గడ్కరీ వివరించారు. దీనికి ఇరువైపులా కనీసం 3–లైన్ల సర్వీస్ రహదారులు ఉంటాయని శ్రీ గడ్కరీ వివరించారు.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలో ప్రధాన జంక్షన్‌లలో 4 బహుళ–స్థాయి ఇంటర్‌ఛేంజ్‌లు (టన్నెల్/అండర్‌పాస్‌లు, ఎట్–గ్రేడ్ రోడ్, ఎలివేటెడ్ ఫ్లైఓవర్ తో పాటు ఫ్లైఓవర్ పైన మరో ఫ్లైఓవర్) ఉంటాయని శ్రీ గడ్కరీ చెప్పారు. రహదారి నిర్మాణం కోసం దేశంలో పట్టణ ప్రాంతంలో తొలిసారిగా పొడవైన (3.6 కి.మీ) మరియు విశాలమైన (8 లేన్) పట్టణ రహదారి సొరంగ నిర్మాణం జరుగుతుందని శ్రీ గడ్కరీ వెల్లడించారు.

ఈ ఎక్స్‌ప్రెస్‌వే జాతీయ రహదారి –8 (ఢిల్లీ–గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వే)లో శివ్–మూర్తి నుంచి ప్రారంభమవుతుంది. ద్వారకా సెక్టార్ 21, గురుగ్రామ్ సరిహద్దు మరియు బసాయి మీదుగా సాగి ఖేర్కి దౌలా టోల్ ప్లాజా దగ్గర ముగుస్తుందని శ్రీ గడ్కరీ వివరించారు.

దేశ రాజధాని ఢిల్లీలో ట్రాఫిక్ రద్దీ తగ్గించాలన్న ప్రధాన లక్ష్యంతో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి రూపకల్పన చేశామని శ్రీ గడ్కరీ తన ట్వీట్ లో తెలిపారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం పూర్తయితే ద్వారకా లోని 25వ సెక్టార్ లో నిర్మిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ కు నేరుగా చేరుకునేందుకు మార్గం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఇంతేకాకుండా ఐజిఐ విమానాశ్రయానికి వెళ్లేవారికి ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుందని వివరించారు. ప్రపంచ స్థాయి రహదారిగా రూపుదిద్దుకుంటున్న ద్వారా ఎక్స్‌ప్రెస్‌వే లో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అధునాతన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సిసిటివి కెమెరాలు, నిఘా మొదలైన అత్యాధునిక ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్స్ (ఐటిఎస్) ఈ ప్రపంచ స్థాయి రహదారిలో భాగంగా ఉంటాయని ఆయన అన్నారు.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీ గడ్కరీ అన్నారు. నిర్మాణంలో తొలగించే దాదాపు 12,000 చెట్లను ఇతర ప్రాంతాలకు రవాణా చేసి నాటేందుకు బృహత్తర ప్రణాళిక సిద్ధం చేశామని శ్రీ గడ్కరీ చెప్పారు. నిర్మాణ రంగంలో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఒక ఇంజనీరింగ్ అద్భుతంగా ఉంటుందని శ్రీ గడ్కరీ వర్ణించారు. మొట్టమొదటి సారిగా ఒక స్తంభం మీద 34 మీటర్ల వెడల్పు 8–లేన్ హైవే నిర్మాణం జరుగుతున్నదని మంత్రి వెల్లడించారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం 2 లక్షల మిలియన్ టన్నుల ఉక్కు (ఈఫిల్ టవర్ నిర్మాణానికి వినియోగించిన ఉక్కు కంటే 30 రెట్లు ఎక్కువ ఉక్కు ) మరియు 20 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ (బుర్జ్ ఖలీఫా నిర్మాణం తో పోలిస్తే 6 రెట్లు ఎక్కువకాంక్రీట్ ) అవసరముంటుందని అంచనా వేశామని శ్రీ గడ్కరీ వివరించారు.

# 2023 నాటికి దేశంలో పట్టణ ప్రాంతంలో మొట్టమొదటి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారి-శ్రీ నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, జులై 11: హర్యానాలోని ద్వారకా ఎక్స్‌ప్రెస్ రహదారిని దేశంలో మొట్టమొదటి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారిగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితీష్ గడ్కరీ వెల్లడించారు.

ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారిగా రూపుదిద్దుకోనున్న ద్వారకా ఎక్స్‌ప్రెస్ వల్ల ఢిల్లీ–గుర్గావ్ ఎక్స్‌ప్రెస్ రహదారి (స్వర్ణ చతుర్భుజంలోని ఢిల్లీ–జైపూర్–అహ్మదాబాద్–ముంబై విభాగంలో భాగం)పై వాహన ఒత్తిడి తగ్గుతుందని శ్రీ గడ్కరీ ట్వీట్ చేశారు. ఢిల్లీ–గుర్గావ్ ఎక్స్‌ప్రెస్ రహదారి గుండా పశ్చిమ ఢిల్లీ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే వాహనాల వల్ల విపరీతమైన రద్దీ ఏర్పడుతూ తరచు వాహనాలు నిలిచిపోతున్నాయి. జాతీయ రహదారి 8 మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాల్లో 50% నుంచి 60% కొత్తగా నిర్మిస్తున్న రహదారిపైకి మళ్లిస్తామని శ్రీ గడ్కరీ వివరించారు. దీనివల్ల సోహ్నా రోడ్డు, గోల్ఫ్ కోర్స్ రోడ్, ఎయిర్ ఎక్స్‌టెన్షన్ మార్గాల్లో ట్రాఫిక్ పరిస్థితి మెరుగుపడుతుందని మంత్రి పేర్కొన్నారు. 2023లో ప్రారంభమయ్యే నూతన ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ రహదారితో ఢిల్లీ–ఎన్ సీ ఆర్ మార్గంలో వాతావరణ కాలుష్యం గణనీయంగా తగ్గుతుందని శ్రీ గడ్కరీ అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రపంచ ప్రమాణాలతో రహదారులను అభివృద్ధి చేసే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నదని శ్రీ గడ్కరీ తెలిపారు. దేశంలో అన్ని ప్రాంతాలను రహదారులతో అనుసంధానం చేసి అనుసంధానం ద్వారా అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని అన్నారు.

ఢిల్లీలోని ద్వారకా నుంచి హర్యానాలోని గురుగాం వరకు 29 కిలోమీటర్ల పొడవైన ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం చురుగ్గా సాగుతోంది. రహదారిలో 19 కిలోమీటర్ల మార్గం హర్యానాలో, మిగిలిన 10 కిలోమీటర్లు ఢిల్లీలో ఉంటాయి. దీనికి 9,000 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని అంచనా వేశారు.

16–లేన్ యాక్సెస్–నియంత్రిత హైవేగా ద్వారకా ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని శ్రీ గడ్కరీ వివరించారు. దీనికి ఇరువైపులా కనీసం 3–లైన్ల సర్వీస్ రహదారులు ఉంటాయని శ్రీ గడ్కరీ వివరించారు.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలో ప్రధాన జంక్షన్‌లలో 4 బహుళ–స్థాయి ఇంటర్‌ఛేంజ్‌లు (టన్నెల్/అండర్‌పాస్‌లు, ఎట్–గ్రేడ్ రోడ్, ఎలివేటెడ్ ఫ్లైఓవర్ తో పాటు ఫ్లైఓవర్ పైన మరో ఫ్లైఓవర్) ఉంటాయని శ్రీ గడ్కరీ చెప్పారు. రహదారి నిర్మాణం కోసం దేశంలో పట్టణ ప్రాంతంలో తొలిసారిగా పొడవైన (3.6 కి.మీ) మరియు విశాలమైన (8 లేన్) పట్టణ రహదారి సొరంగ నిర్మాణం జరుగుతుందని శ్రీ గడ్కరీ వెల్లడించారు.

ఈ ఎక్స్‌ప్రెస్‌వే జాతీయ రహదారి –8 (ఢిల్లీ–గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వే)లో శివ్–మూర్తి నుంచి ప్రారంభమవుతుంది. ద్వారకా సెక్టార్ 21, గురుగ్రామ్ సరిహద్దు మరియు బసాయి మీదుగా సాగి ఖేర్కి దౌలా టోల్ ప్లాజా దగ్గర ముగుస్తుందని శ్రీ గడ్కరీ వివరించారు.

దేశ రాజధాని ఢిల్లీలో ట్రాఫిక్ రద్దీ తగ్గించాలన్న ప్రధాన లక్ష్యంతో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి రూపకల్పన చేశామని శ్రీ గడ్కరీ తన ట్వీట్ లో తెలిపారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం పూర్తయితే ద్వారకా లోని 25వ సెక్టార్ లో నిర్మిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ కు నేరుగా చేరుకునేందుకు మార్గం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఇంతేకాకుండా ఐజిఐ విమానాశ్రయానికి వెళ్లేవారికి ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుందని వివరించారు. ప్రపంచ స్థాయి రహదారిగా రూపుదిద్దుకుంటున్న ద్వారా ఎక్స్‌ప్రెస్‌వే లో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అధునాతన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సిసిటివి కెమెరాలు, నిఘా మొదలైన అత్యాధునిక ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్స్ (ఐటిఎస్) ఈ ప్రపంచ స్థాయి రహదారిలో భాగంగా ఉంటాయని ఆయన అన్నారు.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీ గడ్కరీ అన్నారు. నిర్మాణంలో తొలగించే దాదాపు 12,000 చెట్లను ఇతర ప్రాంతాలకు రవాణా చేసి నాటేందుకు బృహత్తర ప్రణాళిక సిద్ధం చేశామని శ్రీ గడ్కరీ చెప్పారు. నిర్మాణ రంగంలో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఒక ఇంజనీరింగ్ అద్భుతంగా ఉంటుందని శ్రీ గడ్కరీ వర్ణించారు. మొట్టమొదటి సారిగా ఒక స్తంభం మీద 34 మీటర్ల వెడల్పు 8–లేన్ హైవే నిర్మాణం జరుగుతున్నదని మంత్రి వెల్లడించారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం 2 లక్షల మిలియన్ టన్నుల ఉక్కు (ఈఫిల్ టవర్ నిర్మాణానికి వినియోగించిన ఉక్కు కంటే 30 రెట్లు ఎక్కువ ఉక్కు ) మరియు 20 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ (బుర్జ్ ఖలీఫా నిర్మాణం తో పోలిస్తే 6 రెట్లు ఎక్కువకాంక్రీట్ ) అవసరముంటుందని అంచనా వేశామని శ్రీ గడ్కరీ వివరించారు.

# ఒక్క హైదరాబాద్‌లో 2లక్షల పొట్టేళ్ల అమ్మకం..

హైదరాబాద్, జులై 11:బక్రీద్ పండుగ అంటే ముస్లింలకు ఎంతో పవిత్రమైనది. దీంతో హైదరాబాద్? సిటీలో పొట్టేళ్లు, గొర్రెలు, మేకలకు ఫుల్? డిమాండ్ ఉంది. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే పండుగ సందర్భంగా సిటీలో దాదాపు 2లక్షల జీవాలు అమ్ముడయినట్టు తెలుస్తోంది. ఇస్లామిక్ క్యాలెండర్ నెల ధుల్ హిజ్జా ప్రకారం ముస్లింలు 10వ రోజున బక్రీద్? పండుగ జరుపుకుంటారు. దేశంలో ఈ పండుగను జులై 10వ తేదీ నుంచి జరుపుకుంటారు. ఈ సందర్భంగా గొర్రెలు, పశువులను ఒక పద్ధతిగా బలి ఇస్తారు.

ఈ సందర్భంగా మాంసాన్ని మూడు సమాన భాగాలుగా విభజిస్తారు. ఒక భాగం స్నేహితులు, పరిచయస్తులు.. బంధువులకు పంపిణీ చేస్తే.. మరొక భాగం పేదలు, నిరుపేదలకు, మిగిలిన భాగాన్ని తమకోసం ఉంచుకుంటారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన గొర్రెల వ్యాపారులు ఈ పండుగకు భారిగా విక్ర యాలు జరిపినట్టు తెలుస్తోంది.

ఇక.. మార్కెట్‌లో దాదాపు 12 కిలోల మాంసం లభించే గొర్రెను 10వేలకు విక్రయించినట్టు తెలుస్తోంది. సాధారణంగా ముస్లింలు ఖుర్బానీ కోసం 11 కిలోల నుండి 14 కిలోల బరువున్న గొర్రెలను కొనుగోలు చేస్తారని జియాగూడ గొర్రెల మార్కెట్ కమిషన్ ఏజెంట్ తాజుద్దీన్ చెప్పారు. కొంతమంది ఒక్కొక్కటి 20వేల నుండి 50వేల వరకు ఉన్న పెద్ద పొట్టేళ్లను కొనుగోలు చేస్తారని.. వీటిని కనీసం రెండు సంవత్సరాల పాటు యజమానులు ప్రత్యేకంగా పెంచుతారని తెలిపారు. వీటికి డ్రై ఫ్రూట్స్ తో కూడిన ప్రత్యేక ఆహారాన్ని తినిపిస్తారని, సంపన్నులుదీన్ని సామాజిక హోదాకు చిహ్నంగా భావించడమే కారణమని తెలుస్తోంది.

కాగా, హైదరాబాద్ సిటీలోని చంచల్‌గూడ, నానల్ నగర్, మెహిదీపట్నం, ఫలక్‌నుమా, ఖిల్వత్, చాంద్రాయణగుట్ట, షాహీన్‌నగర్, కిషన్‌బాగ్, ఆజంపురా, ముషీరాబాద్, గోల్నాక, బంజారాహిల్స్, జెహ్రా నగర్, బోరబండ, ఏసీ గార్డ్స్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్కెట్‌లలో గొర్రెల అమ్మకం జరిగింది. రెండేళ్లుగా కరోనా మహమ్మారి కారణంగా పెద్దగా గొర్రెల అమ్మకాలు జరగలేదని, అయితే ఈసారి వ్యాపారులు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ప్రయత్నించినట్టు తెలుస్తోంది. ఒకవైపు వర్షాలు కురుస్తున్నా రోడ్ల పక్కన తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పొట్టేళ్ల అమ్మకాలు జరిపారు. ఇక ఈ సారి పండుగ మామూలుగా జరగలేదని సమాచారం.

## కాంగ్రెస్ అధినేత్రి సోనియాకు ఈడీ సమన్లు..!

న్యూఢిల్లీ, జులై 11: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) సోమవారం సమన్లు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ నెల 21న విచారణకు హాజరుకావాలని కోరింది. అయితే, ఈ కేసులో ఈడీ ఎదుట హాజరయ్యేందుకు కొద్దిరోజుల గడువు కోరిన విషయం విధితమే. కరోనా బారినపడి కోలుకున్న సోనియా గాంధీని విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు కొద్ది రోజుల పాటు ఈడీ ఎదుట హాజరుకాలేదనని చెప్పగా.. ఇందుకు ఈడీ సైతం అంగీకరించింది. ఇదే కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని దర్యాప్తు సంస్థ 50 గంటల పాటు ప్రశ్నించింది.

## పన్నీర్ సెల్వంపై బహిష్కరణ వేటు..

చెన్నై, జులై 11: అన్నాడీఎంకేపై పళనిస్వామి క్రమంగా పట్టుపెంచుకుంటున్నారు. పార్టీలో ద్వంద్వ నాయకత్వానికి మంగళం పలికిన సర్వసభ్య మండలి.. మరో సంచలన నిర్ణయం తీసుకున్నది. పార్టీ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంపై బహిష్కరణ వేటు వేసింది. ప్రాథమిక సభ్యత్వం రద్దుచేయడంతోపాటు సహ కోశాధికారి పదవి నుంచి తొలగించింది. ఆయన మద్దతుదారులను కూడా పార్టీ నుంచి బహిష్కరించింది. వారి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేసింది.

చెన్నైలో పళనిస్వామి ఆధ్వర్యంలో అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం జరుగుతున్నది. ఇందులో భాగంగా తొలుత ద్వంద్వ నాయకత్వాన్ని రద్దుచేసిన మండలి.. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని పునరుద్ధరించాలని నిర్ణయించింది. మరో నాలుగు నెలల్లో ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించింది. అప్పటివరకు తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని ఎన్నుకున్నది.

అయితే తనను బహిష్కరించడంపై పన్నీర్‌సెల్వం స్పందించారు. పార్టీ పళనిస్వామి సొత్తు కాదని, తనను పార్టీ నుంచి తొలగించే అధికారం ఎవరికీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకి తానే కోశాధికారినని స్పష్టం చేశారు. తానే పళనిస్వామిని పార్టీ నుంచి తొలగిస్తున్నానని చెప్పారు.

## దేశంలో కొత్తగా 16,678 మందికి కరోనా పాజిటివ్

న్యూఢిల్లీ, జులై 11: దేశంలో కొత్తగా 16,678 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసులు 4,36,39,329కి చేరాయి. ఇందులో 4,29,83,162 మంది బాధితులు కోలుకున్నారు. ఇప్పటివరకు 5,25,428 మంది మరణించారు. పాజిటివ్ కేసులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో యాక్టివ్ కేసులు 1,30,713కు పెరిగాయి. గత 24 గంటల్లో కొత్తగా 26 మంది వైరస్‌కు బలవగా, 14,629 మంది డిశ్చార్జీ అయ్యారు.

ఇక రోజువారీ పాజిటివిటీ రేటు 5.99 శాతానికి పెరిగిందని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. మొత్తం కేసుల్లో 0.30 శాతం కేసులు యాక్టివ్‌గా ఉన్నాయని, రికవరీ రేటు 98.50 శాతం, మరణాలు 1.20 శాతంగా ఉన్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 198.88 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని ప్రకటించింది.



# భీముని పాదం జలపాతానికి పర్యాటకుల సందర్శన నిలిపివేత




మహబూబాబాద్, జులై 11 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భీమునిపాదం జలపాతం సందర్శనను తాత్కాలికంగా మరికొన్ని రోజులు నిలిపి వేస్తున్నట్లు గూడూరు అటవీశాఖ అధికారి సురేష్ తెలిపారు. జలపాతం ముఖ ద్వారం మూసివేసినట్లు తెలిపారు. కావునా వివిధ ప్రాంతాల నుండి వచ్చే సందర్శకులు విషయాన్ని గమనించి జలపాతం వద్దకు ఎవరు రావద్దని ఆయన తెలిపారు.

# పరారీలోనే లంక అధ్యక్షుడు గొటబయ.. భద్రతా దళాల మధ్య సేఫ్ అంటున్న మీడియా వర్గాలు!

న్యూఢిల్లీ, జులై 11: శ్రీలంక సంక్షోభానికి కారణమైన అధ్యక్షుడు గొటబయ రాజపక్సేపై ఒక్కసారిగా ప్రజలనుంచి తిరుగుబాటు ఎదురయ్యింది. దీంతో అతను ఇంట్లో నుంచి పరారయ్యారు. పదివేల మంది నిరసనకారులు లంక అధ్యక్షుడిని, ప్రధానమంత్రిని తమ నివాసాలను విడిచిపెట్టి వెళ్లాలని నిరసనలకు దిగిన రెండ్రోజుల తర్వాత ఇద్దరు నాయకులు బహిరంగంగా కనిపించడం లేదు. అధ్యక్షుడు గోటబయ ఆచూకీ బహిరంగంగా తెలియనప్పటికీ, ప్రధానమంత్రి రణిల్ విక్రమసింఘే ప్రస్తుత చిరునామా చాలా రహస్యంగా ఉందని అధికారులు సోమవారం చెప్పారు.

అయితే.. నిరసనకారులు శనివారం ఉదయం రాజధాని కొలంబోలోని ప్రెసిడెంట్ హౌస్, అతని కార్యాలయం వైపు దూసుకు రావడానికి కొన్ని గంటల ముందు పోలీసులు కర్ఫ్యూను ప్రకటించారు. కర్ఫ్యూ ప్రకటన తర్వాత గందరగోళం మధ్య, రాజపక్సే సురక్షితమైన ప్రదేశానికి పారిపోవడానికి అధ్యక్షుడి భద్రత సిబ్బంది ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

కాగా, జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకుడు అయిన కుసల్ పెరెరా మీడియాతో మాట్లాడుతూ.. గోటబయ అన్నయ్య మహింద రాజపక్స అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నిర్మించిన భూగర్భ బంకర్ ద్వారా నావికాదళ శిబిరానికి అతన్ని తీసుకెళ్లడానికి అధ్యక్షుడి భద్రతకు అవకాశం ఉందన్నారు. అక్కడి నుంచి 73 ఏళ్ల అధ్యక్షుడిని కొలంబో నౌకాశ్రయం నుంచి నౌకాదళానికి తరలించి ఉండవచ్చని పొలిటికల్? అనలిస్టులు కూడా భావిస్తున్నారు.

ఇక.. మహింద రాజపక్సే అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుండి గన్‌బోట్‌లు నౌకాదళ శిబిరం వద్ద సిద్ధంగా ఉన్నాయని మహిందకు సన్నిహితుడు అయిన పెరెరా చెప్పారు. కాబట్టి.. గోటబయ రాజపక్సను భూగర్భ బంకర్ ద్వారా పక్కనే ఉన్న శ్రీలంక నేవీ క్యాంపునకు తీసుకెళ్లి, అధ్యక్ష భద్రతతో పాటు నౌకాదళం ద్వారా వేరే ప్రదేశానికి తీసుకెళ్లి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

కానీ, ప్రస్తుతం ఆ నౌక ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదని, ఇది ఒక అంచనా మాత్రమేనని పెరెరా చెప్పారు. రాజపక్స ప్రస్తుతం సముద్రంలోని నౌకలో ఉన్నారని సైనిక వర్గాలను ఉటంకిస్తూ పలు మీడియా నివేదికలు తెలిపాయి. అతను శ్రీలంక సరిహద్దుకు సమీపంలో ఓడలో ఉండవచ్చని, పరిస్థితి మరింత దిగజారితే దేశం విడిచి పారిపోవచ్చని అధ్యక్షుడికి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

దేశంలోని భద్రతా పరిస్థితిని అంచనా వేయడానికి భద్రతా అధికారులు సోమవారం మరోసారి సమావేశమవుతారని పోలీసు ఇన్‌ఛార్జ్, పబ్లిక్ సెక్యూరిటీ మంత్రి తిరాన్ అల్లెస్ చెప్పారు. రాజకీయ నేతల భద్రతా ఏర్పాట్లు కూడా ఎజెండాలో ఉంటాయని తెలిపారు. అధ్యక్షుడు ఎక్కడ ఉన్నారో చర్చించబోమని,ఆ విషలేవీ బయటికి చెప్పలేమని అలెస్ అన్నారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢం ఉత్సవాలు-శాకంబరిగా అమ్మవారి దర్శనం

విజయవాడ, జులై 11:ఇంద్రకీలాద్రిపై వెలిసిన కనకదుర్గమ్మకు ఆషాఢమాసంలో నిర్వహించే శాకంబరీ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు శాకంబరీ రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకుని తరిస్తునానారు. దాదాపు 12 టన్నుల పండ్లు, కూరగాయలతో అమ్మవారితో పాటు ఆలయాన్ని అందంగా అలంకరించడం ఆకట్టుకున్నది.విజయవాడ కనకదుర్గమ్మకు ఏటా నిర్వహించే శాకంబరీ ఉత్సవాలు కన్నులపండువగా సోమవారం నుంచి మొదలయ్యాయి. ఏటా ఆషాఢమాసంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్లను, ఆలయాన్ని 12 టన్నుల తాజా పండ్లు , కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. తొలుత దాతలు అందజేసిన నిమ్మకాయలు, కూరగాయలకు వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో రుత్వికులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మూలవిరాట్ దుర్గమ్మను వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు.శాకంబరీ ఉత్సవాల తొలిరోజు సోమవారం నాడు విఘ్నేశ్వర పూజ, రుత్విక్ వరుణ, పుణ్యవచనం, అఖండ దీపారాధన, వాస్తు హోమం, కలశ స్థాపన పూజలు నిర్వహించనున్నట్లు ఆయల స్థానాచార్యుడు శివప్రసాద శర్మ వెల్లడించారు. శాకంబరీని పూజించడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు తొలిగిపోయి సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని భక్తులు విశ్వసిస్తారు. మూడు రోజులపాటు శాంకబరీ దేవిగా దర్శనవ్వనున్న అమ్మవారిని కరుణకటాక్షాల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలు సహా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ఈ సీజన్‌లో దాదాపు లక్షకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.




# ప్రకృతి వ్యవసాయంలో సూరత్ నమూనా దేశం యావత్తుకు నమూనా అవుతుంది-ప్రధానమంత్రి -నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జులై 11: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రకృతి వ్యవసాయ సమావేశాన్ని ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగించారు. గుజరాత్ లోని సూరత్ లో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయాన్ని విజయగాధగా చేపట్టిన వేలాది మంది వ్యవసాయదారులు, ఇతర సంబంధిత భాగస్వామ్య వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. గుజరాత్ గవర్నర్, ముఖ్యమంత్రి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అమృతకాల లక్ష్యాలు సాధించాలన్న దేశ లక్ష్యాన్ని చేరే బాటలో గుజరాత్ ముందుండి నడిపిస్తున్నదనేందుకు నేటి కార్యక్రమం ఒక సంకేతమని ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ప్రధానమంత్రి అన్నారు. "ప్రతీ పంచాయతీకి చెందిన 75 మంది వ్యవసాయదారులను ప్రకృతి వ్యవసాయంతో అనుసంధానం చేయడంలో సూరత్ విజయం దేశం యావత్తుకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది" అని ప్రధానమంత్రి చెప్పారు. ఈ వ్యవహారంలో సర్పంచ్ ల పాత్రను ప్రశంసిస్తూ ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులేస్తున్న వ్యవసాయదారులను ఆయన అభినందించారు.

స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశం పలు లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. రాబోయే కాలంలో పెను మార్పులకు అవి ప్రాతిపదిక కానున్నాయి. సబ్ కా ప్రయాస్ స్ఫూర్తితో దేశం పురోగమిస్తున్న తీరు, వేగం మన అభివృద్ధి ప్రయాణానికి మార్గదర్శకంగా ఉన్నాయి అని ప్రధానమంత్రి అన్నారు. అందుకే పేదలు, నిరాకరణకు గురవుతున్న వర్గాల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాల విషయంలో గ్రామ పంచాయతీలకు కీలక పాత్ర ఇవ్వడం జరిగిందని చెప్పారు.

ప్రతీ పంచాయతీ నుంచి 75 మంది రైతులను ఎంపిక చేసి వారికి తగు శిక్షణ, వనరులు కల్పించి ముందుకు నడిపించే ప్రక్రియలో స్థానిక సంస్థలు నిర్మాణాత్మక పాత్ర పోషించాయని ఆయన చెప్పారు. 550 పంచాయతీలకు చెందిన 40 వేల మందికి పైగా వ్యవసాయదారులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు ఇది దోహదపడిందని ఆయన అన్నారు. ఇది గొప్ప ఆరంభం, అత్యంత ప్రోత్సాహకరం అంటూ ప్రకృతి వ్యవసాయంలో సూరత్ నమూనా దేశం యావత్తుకు నమూనాగా నిలుస్తుంది అని ప్రశంసించారు.

ప్రజాభాగస్వామ్య శక్తితో పెద్ద ప్రాజెక్టులు చేపడితే వాటి విజయానికి కూడా ప్రజలే బాధ్యత వహిస్తారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజలు కీలక పాత్రధారులుగా ఉన్న జల్ జీవన్ మిషన్ ను శ్రీ మోదీ ఇందుకు ఉదాహరణగా చూపారు. "గ్రామాల్లో మార్పు తేవడం సాధ్యం కాదు అని వాదించే వారికి డిజిటల్ ఇండియా సాధించిన అసాధారణ విజయమే సమాధానం ఇస్తుంది. గ్రామాలు మార్పు తేవడమే కాదు, ముందు వరుసలో నిలిచి మార్పును తెస్తాయి అని మన గ్రామాలు నిరూపించాయి" అన్నారు. ప్రకృతి వ్యవసాయం కోసం ప్రజా ఉద్యమం కూడా రాబోయే రోజుల్లో అతి పెద్ద విజయంగా నిలుస్తుందని ప్రధానమంత్రి చెప్పారు. ప్రారంభ దశలోనే ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యే వ్యవసాయదారులు భారీ ఫలాలు అందుకోవడం ఖాయమని తెలిపారు.

"మన జీవితం, మన ఆరోగ్యం, మన సమాజం అన్నింటికీ పునాది మన వ్యవసాయ వ్యవస్థే. స్వభావ రీత్యా, సంస్కృతి పరంగా రెండింటిలోనూ మనది వ్యవసాధారిత వ్యవస్థ. మన రైతులు పురోగమిస్తే మన వ్యవసాయం పురోగమించి సుసంపన్నం అవుతుంది, అలాగే మన దేశం కూడా పురోగమిస్తుంది" అని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం అంటే సుసంపన్నత, మాతృభూమిని గౌరవించడం, సేవించడం అని ఆయన గుర్తు చేశారు. "మీరు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టయితే మాతృభూమికి సేవచేసినట్టే. మట్టి నాణ్యతను, దాని ఉత్పాదకతను పరిరక్షించినట్టే. మీరు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టయితే మీరు ప్రకృతి, పర్యావరణం రెండింటినీ సేవిస్తున్నట్టే. మీరు ప్రకృతి వ్యవసాయంలో చేరినట్టయితే గౌతముని సేవించే గౌరవం కూడా మీకు దక్కుతుంది" అని ఆయన చెప్పారు.

ప్రపంచం యావత్తు స్థిరమైన జీవనశైలి గురించి మాట్లాడుతున్నదని ప్రధానమంత్రి గుర్తు చేస్తూ "భారతదేశం శతాబ్దాలుగా ప్రపంచ నాయకత్వ స్థాయిలో ఉన్న ఏకైక రంగం ఇది. అందుకే మనం ప్రకృతి వ్యవసాయం బాటలో ముందుకు సాగుతున్న ఈ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అవకాశాలు పూర్తిగా ఉపయోగించుకోవడం అవసరం" అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి ప్రస్తావిస్తూ "పరంపరాగత్ కృషి వికాస్ స్కీమ్" వంటివి అవసరమైన వనరులు కల్పించడంతో పాటు సాంప్రదాయిక వ్యవసాయంలో శిక్షణ కూడా ఇస్తున్నాయని చెప్పారు. ఈ స్కీమ్ కింద దేశవ్యాప్తంగా 30 వేల క్లస్టర్లు ఏర్పాటు చేశారని, దీని ద్వారా లక్షలాది మంది రైతులు లాభపడుతున్నారని ఆయన తెలిపారు. "పరంపరాగత్ కృషి వికాస్" స్కీమ్ కింద 10 లక్షల హెక్టార్ల భూమిలో ప్రకృతి వ్యవసాయం విస్తరించనున్నట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని నమామి గంగే ప్రాజెక్టుతో అనుసంధానం చేసి గంగా నది వెంబడి ప్రకృతి వ్యవసాయ కారిడార్ ఏర్పాటును చేపట్టినట్టు ప్రధానమంత్రి తెలిపారు.ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సర్టిఫై చేసేందుకు నాణ్యత హామీ విధానం గురించి కూడా ప్రధానమంత్రి తెలియచేశారు. ఇలాంటి సర్టిఫై చేసిన ఉత్పత్తులు వాటిని ఎగుమతి చేసిన రైతులకు మంచి ధర ఆర్జిస్తున్నాయన్నారు.మన శాసనాలు, సంస్కృతిలో దాగి ఉన్న ప్రకృతి వ్యవసాయ పరిజ్ఞానం గురించి ప్రస్తావిస్తూ వివిధ సంస్థలు, ఎన్ జిఓలు, నిపుణులు ఈ ప్రాచీన పరిజ్ఞానంపై పరిశోధన నిర్వహించి ఆధునిక కాల అవసరాలకు అనుగుణంగా దాన్ని రైతులకు ఎలా అందచేయాలో పరిశీలించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రతీ పంచాయతీలోనూ 75 మంది రైతులతో ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయం రసాయనరహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండుతో పాటుగా ఎన్నో రెట్లు పెరుగుతుందన్న విశ్వాసం ఆయన ప్రకటించారు.ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా 2022 మార్చిలో జరిగిన గుజరాత్ పంచాయత్ మహాసమ్మేళన్ లో ప్రధానమంత్రి మాట్లాడుతూ ప్రతీ గ్రామం నుంచి కనీసం 75 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించనున్నట్టు ప్రకటించారు. ప్రధానమంత్రి విజన్ ను మార్గదర్శకంగా తీసుకుని సూరత్ జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలపై వివిధ భాగస్వామ్య విభాగాలు, రైతు బృందాలు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, తలాతిలు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీలు (ఎపిఎంసి), సహకార సంఘాలు, రైతులను చైతన్యవంతం చేసేందుకు సమన్వయపూర్వకమైన కృషి చేపట్టింది. అనంతరం ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి 75 మంది రైతులను గుర్తించి ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చైతన్యవంతం చేసి, అవసరమైన శిక్షణ ఇచ్చారు. 90 విభిన్నమైన క్లస్టర్లలో రైతు శిక్షణ చేపట్టడం ద్వారా జిల్లా మొత్తం మీద 41,000 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు.

# స్వామిజీ ప్రబోధాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ఛాయాచిత్ర జీవిత చరిత్ర డాక్యుమెంటరీల ఆవిష్కరణపై ప్రధానమంత్రి హర్షం

న్యూఢిల్లీ, జులై 11: స్వామి ఆత్మస్థానంద శతజయంతి వేడుకల నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ వీడియో సందేశపూర్వక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా స్వామి ఆత్మస్థానందతో తాను గడిపిన క్షణాలను స్మరించుకుంటూ స్వామిజీకి నివాళి అర్పించారు. అనంతరం సభికులనుద్దేశించి మాట్లాడుతూ– "ఈ కార్యక్రమం అనేక అనుభూతులు, స్మృతులతో నిండినది. ఆయన ఆశీర్వాదాలు నదా నాకు లభిస్తూండేవి. అంతేగాక స్వయంగా ఆయన సమక్షంలో గడిపే అవకాశం కూడా దొరికింది. అంతిమ క్షణాలదాకా ఆయనతో సంభాషించగలగడం నాకు దక్కిన అదృష్టం" అన్నారు. స్వామిజీ ప్రబోధాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ఆయన ఛాయాచిత్రాలతో కూడిన జీవిత చరిత్ర.. డాక్యుమెంటరీల ఆవిష్కరణపై ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం ఎంతగానో కృషి చేసిన రామకృష్ణ మిషన్ అధ్యక్షులు పూజ్య స్వామి స్మరణానందగారికి శ్రీ మోదీ తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యుడైన పూజ్య స్వామి విజ్ఞానానంద నుంచి స్వామి ఆత్మస్థానంద సన్యాస దీక్ష స్వీకరించారని ప్రధాని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. స్వామి రామకృష్ణ పరమహంసలోని ఆత్మచైతన్య స్థితి, ఆధ్యాత్మిక శక్తి ఆయనలో స్పష్టంగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో సర్వసంగ పరిత్యాగం అనే గొప్ప సంప్రదాయం గురించి కూడా శ్రీ మోదీ వ్యాఖ్యానిస్తూ వానప్రస్థాశ్రమం కూడా సన్యాస దీక్షవైపు ఒక అడుగు వేయడమని పేర్కొన్నారు. "ఆత్మోన్నతి సాధనతో సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తూ.. సమాజం కోసం జీవించడమే సన్యాస దీక్షకు అర్థం. సమాజ అభ్యున్నతికి స్వీయ విస్మృతి సాధించడం. జీవుల సేవే సన్యాసికి భగవత్సేవ, ప్రతి ప్రాణిలోనూ పరమశివుడిని దర్శించగలగడమే అత్యంత ప్రధానం" అని ఆయన స్పష్టం చేశారు. సన్యసించడమనే ఉత్తమ సంప్రదాయానికి స్వామి వివేకానంద ఆధునిక రూపమిచ్చారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. స్వామి ఆత్మస్థానంద కూడా ఈ రూపంలోని సన్యాస దీక్షలో నిమగ్నులై జీవితాంతం ఈ ఆదర్శాన్ని ఆచరించారని కొనియాడారు. ఆయన పర్యవేక్షణలోనే బేలూరు మఠం, రామకృష్ణ మిషన్ ఒక్క భారతదేశంలో మాత్రమేగాక నేపాల్, బంగ్లాదేశ్‌లలోనూ విపత్తు సహాయ–రక్షణ కార్యక్రమాల్లో అద్భుత సేవలందించారని ప్రధాని శ్రీ మోదీ గుర్తుచేశారు. గ్రామీణ ప్రజానీకం సంక్షేమం కోసం స్వామిజీ అలుపెరుగని రీతిలో కృషి చేశారని పేర్కొన్నారు. పేదలకు ఉపాధి, జీవనాధార కల్పన కోసం స్వామిజీ సృష్టించిన సంస్థల గురించి కూడా శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పేదలకు సేవ, విజ్ఞాన వ్యాప్తి–దానికోసం చేసే కృషిని స్వామిజీ ఆరాధనగా భావించారని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉద్యమ స్థాయి పనితీరు? కొత్త సంస్థల సృష్టి? సంస్థల బలోపేతమే రామకృష్ణ మిషన్ ఆదర్శాలని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ఇలాంటి సాధువులు ఉన్నచోటల్లా మానవాళికి సేవ చేసే కేంద్రాలు వాటంతటవే పుట్టుకొస్తాయని స్వామిజీ తన సన్యాస జీవనం ద్వారా నిరూపించారని ప్రధాని వ్యాఖ్యానించారు. వందల ఏళ్ల కిందటి ఆది శంకరాచార్యులు కావచ్చు లేదా ఆధునిక కాలంలో స్వామి వివేకానంద కావచ్చు.. భారతదేశ సాధు సంప్రదాయం సదా 'ఒకే భారతం ? శ్రేష్ఠ భారతం' అని ప్రబోధిస్తూనే ఉన్నదని శ్రీ మోదీ అన్నారు. రామకృష్ణ మిషన్ స్థాపన కూడా 'ఒకే భారతం ? శ్రేష్ఠ భారతం' స్ఫూర్తితో ముడిపడి ఉన్నదని గుర్తుచేశారు. స్వామి వివేకానంద చేసిన కృషిని నొక్కిచెబుతూ– ఈ సంకల్పాన్ని తాను ఒక ఉద్యమ రూపంలో ఆచరించానని ప్రధాని అన్నారు. ఆయన ప్రభావం దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ కనిపించిందన్నారు. ఆయన పర్యటనలు బానిసత్వ యుగంలో దేశం తన ప్రాచీన జాతీయ స్పృహను గ్రహించేలా చేసి, కొత్త విశ్వాసాన్ని కూడా నింపినట్లు పేర్కొన్నారు. రామకృష్ణ మిషన్ అనుసరించిన ఈ సంప్రదాయాన్ని స్వామి ఆత్మస్థానంద జీవితాంతం కొనసాగించారని కొనియాడారు.

స్వామిజీతో తాను గడిపిన సమయాన్ని ప్రధాని గుర్తు చేసుకుంటూ– ఆయనతో గుజరాతీ భాషలో మాట్లాడటం తన అదృష్టమని శ్రీ మోదీ అన్నారు. కచ్ భూకంపం సమయంలో స్వామిజీ మార్గదర్శకత్వాన సహాయక చర్యలు చేపట్టిన ఉదంతాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. ఈ మేరకు శ్రీ మోదీ మాట్లాడుతూ– "దేశంలో జాతీయ సమైక్యతకు రామకృష్ణ మిషన్ సాధువులు మార్గదర్శకులన్నది ప్రతి ఒక్కరికీ తెలిసిన వాస్తవమే. అయితే, విదేశాలకు వెళ్లినపుడు వారు అక్కడ భారతీయతకు ప్రాతినిధ్యం వహిస్తారు" అని పేర్కొన్నారు. కాళీమాతపై సుస్పష్ట దృక్కోణంగల సాధువులలో స్వామి రామకృష్ణ పరమహంస ఒకరని, ఆ మాత పాదపద్మాలను అంటిపెట్టుకుని జీవితాంతం ఆత్మసమర్పణ చేసుకున్నారని కొనియాడారు. స్థిరం.. అస్థిరం అన్నదానితో నిమిత్తం లేకుండా ఈ చరాచర జగత్తు సమస్తం ఆ తల్లి చైతన్యం నుంచే విస్తరించిందని పేర్కొన్నారు. బెంగాల్‌లో కాళీ పూజ సందర్భంగా ఆ చైతన్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుందని చెప్పారు. స్వామి రామకృష్ణ పరమహంస ద్వారా స్వామి వివేకానంద వంటి యుగపురుషుల రూపంలో ఈ చైతన్యం, శక్తి సమన్విత కాంతిపుంజం ప్రకాశించిందని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. కాళీమాతను ఆత్మసాక్షాత్కారం చేసుకున్న స్వామి వివేకానంద మదిలోని ఆధ్యాత్మిక దృక్కోణం ఆయనలో అసాధారణ శక్తిని, సామర్థ్యాన్ని నింపిందని తెలిపారు. స్వామి వివేకానంద వంటి మహనీయుడు జగన్మాత కాళిని స్మరిస్తూ భక్తిభావనలో మునిగి, పసివాడిలా ఉద్వేగానికి లోనవుతారని శ్రీ మోదీ అన్నారు. స్వామి ఆత్మస్థానందలోనూ భక్తికి సంబంధించి అదే చిత్తశుద్ధిని, శక్తి సాధన సామర్థ్యాన్ని తాను దర్శించగలిగానని ప్రధాని వ్యాఖ్యానించారు.

స్వామి ఆత్మస్థానంద జీవితానికి నివాళి అర్పించిన సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ మోదీ మాట్లాడుతూ– మన ఆలోచనలు విశాలంగా ఉన్నప్పుడు, మన ప్రయత్నాల్లో మనమెన్నడూ ఒంటరులం కాబోమనే సత్యాన్ని మన రుషులు నిరూపించారని పేర్కొన్నారు. ఎలాంటి వనరులూ లేకున్నా ఉన్నత శిఖర సమానమైన సంకల్పాలను సిద్ధింపజేసుకున్న భరతవర్ష భూమిపై ఇలాంటి ఎందరో సాధువుల జీవన గమనాన్ని మీరు చూస్తారని వ్యాఖ్యానించారు. స్వామి ఆత్మస్థానంద జీవితంలోనూ అదే విశ్వాసం, అంకితభావాన్ని శ్రీ మోదీ చూశారు. భారతదేశ వాసి అయిన ఒక వ్యక్తి.. జ్ఞాని ఇంత చేయగలిగినపుడు 130 కోట్ల మంది ప్రజల సమష్టి సంకల్పంతో సాధించలేని లక్ష్యం ఏదీ ఉండదని ప్రధాని వ్యాఖ్యానించారు.

అనంతరం డిజిటల్ భారతం గురించి ప్రధానమంత్రి శ్రీ మోదీ ఉటంకిస్తూ– డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. అలాగే దేశ ప్రజలకు 200 కోట్ల వ్యాక్సిన్ డోసులు అందించడం ద్వారా సాధించిన విజయాలను కూడా ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఆలోచనలు నిర్మలమైనవిగా ఉన్నపుడు కృషి ఫలించడానికి ఎక్కువ సమయం పట్టదని, అడ్డంకులు తొలగిపోయి మనకు దారి ఇస్తాయనే వాస్తవానికి ఈ ఉదంతాలే నిదర్శనాలని పేర్కొన్నారు.

గౌరవనీయులైన సాధువులనుద్దేశించి ప్రధాని ప్రసంగిస్తూ– స్వాతంత్ర్య అమృత మహోత్సవాలలో భాగంగా ప్రతి జిల్లాలో 75 అమృత సరోవరాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ ప్రజలను ఉత్తేజితులను చేస్తూ మానవ సేవ అనే బృహత్కార్యంలో భాగస్వాములు కావాలని శ్రీ మోదీ కోరారు. శతాబ్ది సంవత్సరాలు కొత్త శక్తి, కొత్త స్ఫూర్తి సంవత్సరంగా మారుతున్నాయని, దేశంలో కర్తవ్య భావనను మేల్కొల్పడంలో స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు విజయవంతం కావాలని శ్రీ మోదీ ఆకాంక్షించారు. మనందరి సమిష్టి సహకారం పెనుమార్పును తీసుకురాగలదని సూచిస్తూ ఈ దిశగా సంకల్పం పూనాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

# నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్ జులై 11:గత ఐదు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మహబూబ్ నగర్ రూరల్ మండలం దివిటి పల్లి గ్రామంలో కొన్ని ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. విషయం తెలుసుకున్న వెంటనే ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారికి వెంటనే నిత్యావసర సరుకులను మంత్రి సతీమణి శారదతో కలిసి పంపిణీ చేశారు.ఇండ్లు కూలిపోయిన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని మంత్రి కల్పించారు.

గ్రామాల్లోనూ కూలిపోయే దశలో ఉన్న ఇండ్లను గుర్తించి వెంటనే వారిని పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యావసర సరుకులు అందజేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట దివిటిపల్లి సర్పంచ్ జరీనా, ఉపసర్పంచ్ వేమన తదితరులు ఉన్నారు.

# మొక్కలు నాటిన పల్లా రాజేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, జులై 11: గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా తన పుట్టిన రోజును పురస్కరించుకొని.. రైతు బంధు సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి నాంపల్లిలోని రైతుబంధు సమితి కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంతో రాష్ట్రం ఆకుపచ్చని తెలంగాణ మారి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

హరితహారం స్ఫూర్తితో కొనసాగుతున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగస్వామ్యం చేసినందుకు ఎంపీ సంతోష్ కుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

# అధైర్య పడకండి అండగా ఉంటాం : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్, జూలై 11 : జిల్లాలోని నిర్మల్ నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి వరుసగా మూడో రోజు విస్తృతంగా పర్యటించారు. జోరు వానను సైతం లెక్క చేకుండా వాగులు, వంకలు దాటుతూ.. బురదలోనే సోమవారం పరిమండల్, కిషన్ రావు పేట్ ముంపు గ్రామాల్లో పర్యటించారు.

కిషన్ రావు పేటలో గండిపడిన చెరువును పరిశీలించారు. ముంపునకు గురైన ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే వారికి భరోసా కల్పించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతుల పరిస్థితిని నేరుగా తెలుసుకున్న మంత్రి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

జిల్లాలో సగటున 22 సెంటిమీటర్ల భారీ వర్షం కురవడం వల్ల ఈ ప్రాంతమంతా అతలాకుతలమైందన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులు అన్నీ నిండుకుండలా మారాయన్నారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ముశ్రఫ్ అలీ ఫారూఖీ, తదితరులు ఉన్నారు.

# యాదాద్రీశుడిని దర్శించుకున్న మోత్కుపల్లి నర్సింహులు



యాదాద్రి భువనగిరి, జూలై 11 : యాదాద్రి శ్రీ లక్ష్మీ స్వామివారిని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కాలినడక దర్శించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు యాదాద్రి పాదాల వద్దకు చేరుకున్న ఆయన మెట్ల మార్గం గుండా కాలినడకన స్వయంభు ఆలయానికి వెళ్లారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తన పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. కరోనాతో బాధపడుతున్న తాను యాదాద్రి కృపతో ఆరోగ్యవంతంగా బయటపడ్డాను అని అందుకే స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవించాలని, తెలంగాణ సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు.

# భారీ వర్షాలు కారణంగా వాహన దారులు ఇబ్బంది



మహబూబాబాద్, జులై 11 (నేటినిజం ప్రతినిధి): ప్రస్తుతం అతి భారీ వర్షాలు కురిసి నందున పెద్దవంగర మండలము లోని బాబోజి తండా కిస్తు తండా నేషనల్ హైవే రోడ్ పూర్తి గా దెబ్బ తినడం వల్ల వాహన దారులు ఇబ్బంది పడున్నందున మరియు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రహించి వెంటనే సంబంధిత జాతీయ రహదారి ఇంజనీర్ కి ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి సమాచారం ఇచ్చి వెంటనే జెసిబి ద్వారా చదును చేయించటం జరిగినది.ప్రస్తుతం వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్తున్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఖుర్షీద్, శరత్ చంద్ర జాతీయ రహదారి ఇంజనీర్ , కిన్నెర యాకయ్య ఎంపీఓ, పరమేశ్వర్ పంచాయతి సెక్రటరీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఐఐటీ (జెఈఈ) మెయిన్స్-22లో ఆల్ఫోర్స్ ప్రభంజనం



కరీంనగర్ , జులై 11: (నేటినిజం ప్రతినిధి): ఐఐటీ (జెఈఈ) మెయిన్స్-22 మొదటి విడత ఫలితాలలో ఆల్ఫోర్స్ విద్యార్థులు

వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయిలో అత్యద్భుత ప్రతిభ కనబరిచారు. ఇందులో యమ్ స్వాతిక్ 99.64 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. పి సాయిక్యాక్ 99.58, ఆర్ రిష్మిత 99.55, సిహెచ్ నిష్క్రాంత్ రెడ్డి 99.40, డి.విశ్వంత్రెడ్డి 99.27, సి హెచ్ సాయిశివచరణ్ 99.05, కెవివిఎస్ ఎస్ రష్మిత 98.93, బి నవధీప్ 98.75, సిహెచ్ రాజవిఘ్నేష్ 98.44, ఏ భార్గరెడ్డి 98.30, డి కార్తికేయ 98.18 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. 61 మంది విద్యార్థులు 90 ఆపై పర్సంటైల్ సాధించడం విశేషం.

# ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

## -రాజన్నకు ప్రత్యేక పూజలు చేసిన బీజేపీ శ్రేణులు



రాజన్న సిరిసిల్ల, జులై 11 (నేటినిజం ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ జన్మదిన వేడుకలను సోమవారం. బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో కోడె మొక్కులు చెల్లించి, బండి సంజయ్ పేరుమీద అర్చన చేయించారు. బండి సంజయ్ ఆయురారోగ్యాలతో ఉండి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముప్పిడి సునంద-శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, గడ్డమీది లావణ్య-శ్రీనివాస్ హరీష్- కృష్ణవేణి, పిన్నింటి హనుమాన్లు, యువ మోర్చా పట్టణ అధ్యక్షులు నామాల శేఖర్, తిరుమల్ రెడ్డి, సుమంత్ రెడ్డి, బిజెపి నాయకులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# తమ11వ ఎడిషన్ టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్ నోయిడాలో జరుగనుందని వెల్లడించిన ఇండియా ఇట్మీ (India ITME)

న్యూఢిల్లీ, జులై 11: ఇండియా ఇట్మీ సొసైటీ తమ 11వ ఎడిషన్ టెక్స్‌టైల్ ప్రదర్శన నోయిడాలో జరుగనున్నట్లు వెల్లడించింది. నోయిడాలోని ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్ లిమిటెడ్ వద్ద డిసెంబర్ 8 నుంచి 13వరకూ ఇది జరుగనుంది.

ఈ ప్రదర్శనలో భాగంగా 2,35,000 చదరపు మీటర్ల వైశాల్యంలో 15 హాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ విభాగంలో ఇది అతిపెద్ద ప్రదర్శనగా నిలుస్తుంది.ఆరు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో 1800 మందికి పైగా ఎగ్జిబిటర్లు 22 చాప్టర్లలో పాల్గొనడంతో పాటుగా 1,50,000మంది సందర్శకులు పాల్గొంటారని అంచనా.

ఈ కార్యక్రమ ప్రధాన ఆకర్షణలు :

-ఇండియాను టెక్స్‌టైల్ మరియు టెక్స్‌టైల్ ఇంజినీర్డ్ సోర్సింగ్ కేంద్రంగా మార్చే ప్రయత్నం

-టెక్స్‌టైల్ మెషినరీ తయారీ కోసం భారతదేశంలో పెట్టుబడులకు ప్రోత్సాహం. అలాగే టెక్స్‌టైల్ ఇంజినీరింగ్ కోసం తయారీకేంద్రంగా భారతదేశాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ కార్యకలాపాలు

-తయారీదారుల కోసం టియర్ 2 మరియు గ్రామీణ మార్కెట్‌ల నుంచి కొత్త కస్టమ్ లీడ్‌లను రూపొందించడానికి కొత్త మార్కెట్ అభివృద్ధిని ప్రోత్సహించడం

-దేశీయ మరియు విదేశీ మార్కెట్‌ల కోసం తయారీదారులతో ఏజెంట్లు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లను కలుపడం

ఇండియా ఇట్మీ 2022 సాటిలేని వ్యాపార అవకాశాలను ఎగ్జిబిటర్లకు అందించనుంది. లీడ్స్, కాంటాక్ట్స్, ఎంక్వైరీల రూపంలో ఇది పలు వ్యాపార అవకాశాలను తెరుస్తుంది.

దాదాపు 22 చాప్టర్లు, 91 దేశాల నుంచి ఎగ్జిబిటర్లు పాల్గొనే ఇట్మీ ఇప్పుడు ఇంజినీరింగ్, సాంకేతిక పరిష్కారాలకు ఏకీకృత కేంద్రంగా నిలువడంతో పాటుగా భారతీయ టెక్స్‌టైల్ పరిశ్రమకు సేవలనందించనుంది.

# జలమయమైన లోతట్టు ప్రాంతాలను సందర్శించిన :- అధికారులు,ప్రజాప్రతినిధిలు

నేటి నిజం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ప్రతినిధి

వేములవాడ పట్టణంలో గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొనాయిపల్లి లో జలమయమైన లోతట్టు ప్రాంతాలు బేడ బుడగ జంగాల కాలనీ ని ఆర్టీవో లీల తహశీల్దా ర్ రాజారెడ్డి ,కమిషనర్ శ్యామ్ సుందర్ రావు మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి పరిశీలించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతంలో నివసిస్తున్న వీరి ఇంట్లోకి నీళ్లు రావడంతో మా పాలకవర్గం తక్షణమే అప్రమత్తమై కౌన్సిలర్లు అధికారులతో అక్కడికి వెళ్లి పరిశీలించి లోతట్టు ప్రాంతాల నుండి ఒకరోజు క్రితం సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని వీరికి భోజన వసతి తాత్కాలికంగా ఉండడానికి కూడా వసతి ఏర్పాటు చేయడం జరిగిందని ఇట్టి విషయాని ఎమ్మెల్యే రమేష్ బాబు దృష్టికి తీసుకపోగా వారు తక్షణమే స్పందించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని ఇకముందు ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందని వారన్నారు.వారి వెంట ఇరిగేషన్ అధికారులు, డి ఈ ప్రశాంత్ , కౌన్సిలర్లు గడ్డమీది లావణ్య , యాచమనేని శ్రీనివాస్ రావు ,అధికారులు,సిబ్బంది ఉన్నారు .



# అది మౌన దీక్ష కాదు.. తెలంగాణపై అసూయ దీక్ష : మంత్రి గంగుల



కరీంనగర్ , జులై 11: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కరీంనగర్‌లో చేసిన మౌన దీక్ష పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం కరీంనగర్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బీజేపీ మోసపూరిత విధానాలపై ఘాటుగా స్పందించారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పేర్కొంటూ సోమవారం బండి కరీంగనర్‌లో రెండు గంటల పాటు మౌన దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అది మౌన దీక్ష కాదని, తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక చేస్తున్న ఆసూయ దీక్ష అని విమర్శించారు.

సంజయ్ తన దీక్ష సందర్భంగా అతని పక్కనే సీఎం కేసీఆర్ కోసం అంటూ మహారాజా కుర్చీ వేసారని, నిజానికి కేసీఆర్ తెలంగాణ ప్రజలకు మహారాజే అని పేర్కొన్నారు. అయితే కుర్చీ వేసి దీక్ష చేయాల్సింది ఇక్కడ కాదని, కేంద్రం నుంచి రావాల్సిన హక్కుల కోసం, నిధుల కోసం ప్రధాని మోదీ ముందు చేయాలని మంత్రి సూచించారు.

అలా బండి చేస్తే..ఆ దీక్షలో తాను కూడా పాల్గొంటానని స్పష్టం చేశారు. మోదీ ఆఫీస్ ముందు కుర్చీ వేసుకొని అడుగాల్సిన ప్రశ్నలు అనేకం ఉన్నాయన్నారు. దానికి బండి సంజయ్ సిద్ధంగా ఉన్నారో లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేసారు.

గత ఎన్నికల హామీల్లో భాగంగా ఒక్కొక్కరి అకౌంట్లో రూ. 15లక్షలు వేస్తామని చెప్పిన ప్రధాని ఎందుకు వేయలేదో ప్రశ్నిస్తూ.. ఏ బ్యాంకు, ఏ ఏటీఎం ముందు దీక్ష చేయాలో అడుగాలన్నారు.

అలాగే ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తా మని హామీ ఇచ్చారు. ఆ లెక్కన గడిచిన ఏనిమిదేళ్ల పాలనలో మొత్తం 16 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి. ఇందుకోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందు కుర్చీ వేసి దీక్ష చేద్దామా అని సవాల్ విసిరారు. బ్లాక్ మనీ కోసం ఆర్బీఐ, ఈడీల ముందు కుర్చీ వేసుకొని దీక్ష చేద్దాం రమ్మంటూ సంజయ్‌కు సవాల్ విసిరారు. గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజీల్ ధరల పెంపుపై ప్రధాని ముందు ధర్నా చేసే సత్తా బండికి ఉందా అని పశ్నించారు.

ఈ తరహా ధర్నాకు దేశంలో ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ వస్తుందని, వారితో పాటుగా వేము రావడానికి సిద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసిన ప్రధానిని నిలదీసేందుకు మౌన దీక్ష చేయాలని సూచించారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలని 2014లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానంచేసి పంపినా నేటికి దిక్కులేదన్నారు.

బీసీ గణన చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరితే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బీసీలపై ఇంత వివక్షతో కేంద్రం వ్యవహరిస్తుంటే.. ఓ బీసీ బిడ్డవై ఉండి మోదీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని బండి పై ఫైర్ అయ్యారు.

ధరణి అమల్లోకి తెచ్చి 98 శాతం భూ సమస్యలకు పరిష్కారం చూపిన గొప్ప సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. మిగిలిన ఒకటి రెండు శాతం రెవన్యూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు.

సమావేశంలో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సూడా చైర్మన్ జీవీ రామకృష్ణ రావు, మేయర్ సునీల్ రావు, బండ శ్రీనివాన్, చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

# ఈనెల 20 శ్రీలంక నూతన అధ్యక్షుడి ఎన్నిక!

న్యూఢిల్లీ, జులై 11: శ్రీలంక కొత్త అధ్యక్షుడిని జులై 20న ఎన్నుకోనున్నట్లు పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి ప్రసన్న రణతుంగ సోమవారం ప్రకటించారు. జులై 13న అధ్యక్షుడు గోటబయ రాజపక్స రాజీనామా చేస్తే, జులై 20న కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని పార్టీ నేతలు నిర్ణయించుకున్నారని రణతుంగ తెలిపారు. పార్టీ నేతల సమావేశంలో నిర్ణయించిన ప్రకారం జులై 13న రాష్ట్రపతి రాజీనామా చేస్తే .. జులై 15న పార్లమెంటు సమావేశమవుతుందని, ఆ తర్వాత రాష్ట్రపతి పదవికి జులై 19న నామినేషన్లు స్వీకరించి, జులై 20న కొత్త రాష్ట్రపతిని ఎన్నుకుంటారని అధికారిక సమాచారం..

అయితే.. శనివారం అధ్యక్షుడి భవనంలోకి వేలాదిగా చొచ్చుకువచ్చిని జనం.. కోటలోని ప్రెసిడెంట్ హౌస్‌లో ఎంజాయ్? చేస్తూ కనిపించారు. క్యారమ్ బోర్డ్ ఆడుతూ, సోఫాలో నిద్రిస్తూ, పార్క్ ఆవరణలో ఆనందిస్తూ, రాత్రి భోజనానికి ఆహారాన్ని సిద్ధం చేస్తున్న ఫొటోలు, విజువల్స్ ఎన్నో బయటికి వచ్చాయి.

కాగా, కొనసాగుతున్న నిరసనల మధ్య ప్రధాని రణిల్ విక్రమసింఘే కూడా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే.. రాష్ట్రపతి, ప్రధాని నివాసాలను ఆక్రమించిన ఆందోళనకారులు తమ పదవులకు రాజీనామా చేసే దాకా వారి ఇళ్లను విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. దేశంలో అధ్వానంగా మారుతున్న ఆర్థిక పరిస్థితి ఇట్లాంటి ఉద్రిక్తతలకు దారితీసింది.

1948లో స్వాతంత్ర్యం పొందినప్పటి నుండి శ్రీలంక దాని అత్యంత ఘోరమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది, ఇది అూంఎఆ-19 యొక్క వరుస వేవ్?ల నేపథ్యంలో జరిగినట్టు తెలుస్తోంది. ఈ పరిస్థితి కొన్ని సంవత్సరాల అభివృద్ధి, పురోగతికి ఆటంకంగా మారిందనే చెప్పవచ్చు.

అంతకుముందు జులై 13న అధ్యక్షుడు గొటబయ తన పదవికి రాజీనామా చేస్తారని స్పీకర్ మహింద యాపా అబేవర్ధన విలేకరులతో తెలిపారు. అధ్యక్షుడు గోటబయ రాజపక్సే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు అధికారికంగా ప్రధాని విక్రమసింఘేకు తెలియజేశారు.

ఇంతలో శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య ప్రదర్శన ప్రారంభమైన రోజు "ప్రజా దినం"గా పేర్కొన్నారు. చమురు సరఫరా కొరత కారణంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేయవలసి వచ్చిందని, ఇంధన కొరత కారణంగా 1990 అత్యవసర అంబులెన్స్ సేవలు అనేక ప్రాంతాల్లో నిలిపి వేశారని ఆయన తెలిపారు. ఆర్థిక సంక్షోభం ముఖ్యంగా ఆహార భద్రత, వ్యవసాయం,

# ప్రజలు అధికారులకు సహకరించాలి : మంత్రి సత్యవతి రాథోడ్



ములుగు, జులై 11: రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం వద్ద గోదావరి నది వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ..వర్షాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారన్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా లోతట్టు ముంపు గ్రామాలను అప్రమత్తం చేస్తూ అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపడుతుందన్నారు.ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్ కవిత, కలెక్టర్ ఎస్ కృష్ణ ఆదిత్య, పీఓ అంకిత్ తదితరులు ఉన్నారు.

# సీఎం కేసీఆర్ ప్రశ్నలతో మైండ్ బ్లాక్ అయ్యింది..

## బండి సంజయ్‌పై ఎమ్మెల్యే నన్నపునేని ఫైర్

అమరావతి, జులై 11: బీజేపీ విధానాలను ప్రశ్నించి.. ఏం చేస్తే దేశం బాగుపడుతుందో వివరిస్తే.. సీఎం కేసీఆర్? ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వెకిలి నవ్వులు, చిల్లర మాటలు మాట్లాడుతున్న బండి సంజయ్?కి ప్రజలు త్వరలోనే బుద్ధిచెబుతారని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. హన్మకొండలో ఇవ్వాల (సోమవారం) ప్రభుత్వ చీఫ్ విప్ ధాస్యం వినయ్ భాస్కర్, మేయర్ గుండు సుదారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

"సీఎం కేసీఆర్ తన ప్రెస్ మీట్ లో దేశాన్ని ఆలోచింపజేశారు. బీజేపీ విధానాలను ఎండగట్టారు.. పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని దేశ ప్రజలకు వివరించారు. సీఎం కేసీఆర్ ప్రెస్ మీట్ తో బీజేపీ నేతల మైండ్ బ్లాక్ అయ్యింది. అందుకే వింత వింతగా మాట్లాడుతున్నారు. మోదీ ఉబ్బియ్యగానే బండి సంజయ్ ముఖ్యమంత్రి కేసీఆర్ పై పిచ్చి కూతలు కూస్తున్నాడు. అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నాడు" అని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్? ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజలకేమి చేశారో చెప్పమంటే.. పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నాడు బండి.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తున్నారు.. తెలివితక్కువ దద్దమ్మ, తంబాకు నోరు బండి సంజయ్" అని ఎద్దేవా చేశారు.హిందువులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం చేశారో ప్రజలకు బాగా తెలుసు.. తెలంగాణలో హిందువులకు టీఆర్ఎస్ ఏం చేసిందో, బీజేపీ ఏం చేసిందో చర్చకు సిద్ధమా? కరీంనగర్ లో నిన్ను చూసి ప్రజలు ఛీ కొడుతున్నారు.. దేశాన్ని ముంచుతూ, అప్పులు ఎగ్గొట్టి పోయినోళ్లను దేశం దాటించిన పార్టీ బీజేపీ"అని నరేందర్? విమర్శలు గుప్పించారు. నాడు ఆజాంజాహి మిల్ ను కాంగ్రెస్? ప్రభుత్వం నాశనం చేసింది.. ఇప్పుడు బీజేపీ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ని తరలించి అన్యాయం చేసిందని మండిపడ్డారు.

భారీ వర్షాల నేపథ్యంలో 'కాకతీయ సప్తాహం" వాయిదా.. కాకతీయ ఉత్సవాలు ఘనంగా ప్రారంభించామని, కాకతీయ వారసుడిని తీసుకువచ్చి ఘనంగా వేడుకలు జరిపామని, కానీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలనుకున్న కాకతీయ సప్తాహం ఉత్సవాలను ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్టు తెలిపారు ప్రభుత్వ చీఫ్? విప్? ధాస్యం వినయ్?భాస్కర్?, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్?. మూడు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న బారీ వర్షాలు,



వాతావరణ శాఖ హెచ్చరికలతో ఈ ఉత్సవాలు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

గతంలో వరదలొస్తే మంత్రి కేటీఆర్ వచ్చి పరిస్థితిని పరిశీలించారని, అప్పుడే వరంగల్?కు వరదలు రాకుండా శాశ్వత పరిష్కారం కనుగొన్నట్టు వారు తెలిపారు. దీంతో వరంగల్ తూర్పులో 75 ఏండ్లలో ఎవరూ చేయని ప్రయత్నాన్ని 250 కోట్ల రూపాయలతో వరద నీటి కాలువల నిర్మాణాన్ని చేపడుతున్నట్టు వివరించారు. అందులో భాగంగా శివనగర్ లో పనులు పూర్తయ్యాయని, మిగతా చోట్ల కూడా పనులు జరుగుతున్నట్టు తెలిపారు. దీంతో వరంగల్? సిటీ ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.

# ముంపు గ్రామాల నిర్వాసితులకు సీఐ వెంకటేష్ ఆర్థికసాయం




రాజన్న సిరిసిల్ల, జులై 11 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం సంకేపల్లి గ్రామంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి ముంపు నిర్వాసితుల ఇండ్లు కూలిపోగా పట్టణ సిఐ వెంకటేష్ వారికి అండగా నిలిచారు. సోమవారం నిర్వాసితులకు బ్లాంకెట్లు, నిత్యావసర వస్తువులు ఆర్థిక సహాయం కింద అందజేశారు. నిర్వాసితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాసితులు సీఐ వెంకటేష్ కు ధన్యవాదాలు తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ



రాజన్న సిరిసిల్ల, జులై 11 (నేటినిజం ప్రతినిధి): : వేములవాడ అర్బన్ మండలం చీర్ల వంచ (ఆర్ అండ్ ఆర్ కాలనీ)లో మరణించిన పెద్దాల కొమురవ్వ కుటుంబాన్ని తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ రంగు సత్తమ్మ- రాములు, ఎంపీటీసీ వనపర్తి దేవరాజు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నెరేళ్ల భాస్కర్, సత్తయ్య, మానువాడ శ్రీనివాస్, కొమురం రవి, పర్శరాములు తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రమాణం

అమరావతి, జులై 11: కర్నూలు జిల్లా ఆత్మకూరు ఉప ఎన్నికల్లో అధికార పార్టీ వైసీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన మేకపాటి విక్రమ్‌రెడ్డి ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఛాంబర్‌లో ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మేకపాటిని శాలువాతో సన్మానించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌తో పాటు వైసీపీ నాయకులు మేకపాటికి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోదరుడు గౌతమ్ ఆశయాలను నెరవేరుస్తానన్నారు. గెలిపించిన ఆత్మకూరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ మంత్రిగా పనిచేసిన మేకపాటి గౌతంరెడ్డి గుండెపోటుతో మరణించడంతో ఖాళీ అయిన ఆత్మకూరు స్థానానికి ఎన్నికల సంఘం ఉప ఎన్నికను నిర్వహించింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగి విక్రంరెడ్డి పోటీచేయగా ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీ అభ్యర్థి పోటీ చేశారు. ఉప ఎన్నికల్లో మేకపాటి విక్రమ్ రెడ్డి 82,888 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.




Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.